ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 37.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:21 (ఆది)
సహరి : 4:47 (సోమ)

కోడ్ కూసింది

ఎన్నికల షెడ్యూల్ విడుదల

- సుదీర్ఘ ఎన్నికల పరీక్షా కాలమిది
- పోటీ చేసే అభ్యర్థులకు ముచ్చెమటలు
- టైం దొరికిందని సరిపెట్టుకుంటున్న ఇంకొందరు
- వైసీపీకి మాత్రం ముందుంది ముసళ్ల పండుగ
- తాజాగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రకటన
- నరసాపురం, ఉండిలో చిత్రవిచిత్రాలు

- ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన
- ఏప్రిల్ 29న నామినేషన్ల ఉపసంహరణ
- మే 13న పోలింగ్
- జూన్ 4న ఓట్ల లెక్కింపు

ఎన్నికలు జరిగే తేదీలు వచ్చేశాయి. ఎన్నికల కోడ్ కూసింది. అన్ని రాజకీయ పక్షాలు ఊహించింది ఒకటి.. జరిగినది ఇంకొకటి. పోలింగ్ ప్రక్రియ చివరి విడత అవి తేలేసరికి పోటీలో వున్న అభ్యర్థులకు ముచ్చెమటలు పడుతు న్నాయి. ఇంకా గడువు ముగియవందున ఆలోపే అన్ని సర్దుకోవచ్చుని కొన్ని పక్షాలు సరిపెట్టుకున్నాయి. కొంతమేర అధికార యంత్రాంగం అధికార పార్టీ పంజరంలో నుంచి బయట పడి చకచక మిగిలిన నిబంధనలను పాటించేలా ముందుకొస్తున్నారు. అధికార వైసీపీ తన అభ్యర్థులను ప్రకటించింది. కొత్త పాతలను కలబోసి జాబితాలను విడుదల చేసింది. ఉండి, నరసాపురంలో సీనియర్లు కాకెక్కించారు.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

గీత దాటితే.. అంతే సంగతి..

సాధారణంగా ఇప్పటివరకు సార్వత్రిక ఎన్నికలన్నీ దాదాపు తొలివిడత ముగిసేవి. కానీ దీనికి విరుద్ధంగా ఈసారి పోలింగ్ ప్రక్రియలో చివరి దశ మనకొచ్చి పడింది. ఎన్నికల కోడ్ శనివారం నుంచి అమల్లోకి వచ్చింది. ఎక్కడికక్కడ ఎన్నికల నియామవళి అమలుకు వీలుగా అధికారులు రంగంలోకి దిగారు. సాధ్యమైనంత మేర సాయంత్రం నాటికే ఎక్కడికక్కడ నాయకుల ఫ్లెక్సీలను తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా వున్న పోస్టర్లను తొలగించడం ఆరంభించారు. ఇన్నాళ్లు అధికార వైసీపీ ఇష్టానుసారం ఏలూరు నగరాన్ని ఫ్లెక్సీలతో ముంచెత్తింది. పోస్టర్లతో గోడలను కప్పేసింది. ఎక్కడికక్కడ సొంత ప్రచారానికి వాడేశారు. ఏలూరు కార్పొరేషన్ పరిధిలో ఎక్కడ చూసినా వివిధ పార్టీల జెండాలు, ఫ్లెక్సీలే. వీటన్నింటిని శనివారం సాయంత్రం నుంచే తొలగించడం ఆరంభించారు. ఎన్నికల నియామవళి ప్రకారం ఇకముందు అధికార యంత్రాంగం యావత్తు ఎన్నికల కమిషన్ పరిధిలోనే వ్యవహరించాల్సి ఉంటుంది. నగరంతో పాటు పట్టణంలో వున్న ప్రభుత్వ అతిథి గృహాలను మంత్రులు, ఎమ్మెల్యే, ఇతర రాజకీయ పక్షాలకు ఏమాత్రం కేటాయించకూడదు. అభ్యర్థుల బ్యాంకు ఖాతాలను సమర్పించాల్సి ఉంటుంది. ఇలా ఒకటేమిటి ప్రతి అంశంపైనా నిఘా ఉంటుంది. ఇన్నాళ్లు స్వేచ్ఛగా వ్యవహరించిన, ముఖ్యంగా అధికార పార్టీకి ముక్కుతాడు పడనుంది. ఎన్నికల విధుల్లోకి వలంటీర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులను అనుమతించబోమని ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో తెలుగుదేశం, మిత్రపక్షాలు కొంత ఊపిరిపీల్చుకున్నాయి.

ఇప్పటికే వలంటీర్లు బహిరంగంగా అధికార వైసీపీకి కార్యకర్తల్లా పనిచేస్తున్నారు. కొందరు సచివాలయ ఉద్యోగులదీ ఇదే దారి. ప్రత్యేకించి ఉద్యోగుల్లోని మరికొందరు తమ పార్టీ వైసీపీగానే భావిస్తూ బహిరంగ కామెంట్లు చేస్తూ వచ్చారు. ఇకపై ఇలాంటి వారందరికీ ఎన్నికల కమిషన్ చెక్ పెట్టనుంది. నిబంధనలకు విరుద్ధంగా ఏ ప్రభుత్వ ఉద్యోగి వ్యవహరించినా తక్షణ చర్యలకు రంగం సిద్ధమైంది. ఉద్యోగ సంఘాలు సైతం ఎన్నికల నిబంధనలకు లోబడి వ్యవహరించాల్సిందేనని ఆదేశాలు వచ్చాయి. శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు ఉండనే ఉండవు. ప్రజలను మభ్య పెట్టేలా ఉండే ఏ కార్యక్రమానికి అనుమతులు లేవు. ఇప్పటికే ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఎన్నికల నియామవళిని కచ్చితంగా పాటించాల్సిందేనని పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.



ఎన్నికల కోడ్ రావడంతో ఏలూరు కర్రల వంతెన వద్ద ఫ్లెక్సీలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కుయ్యో.. మొర్రో..



ఎన్నికల తేదీల ప్రకటన కాస్తా ఈసారి పోటీలో వున్న అభ్యర్థుల గుండెల్లో బాంబులు పేల్చింది. గడిచిన 30 రోజులుగా ఎడాపెడా కార్యక్రమాలతో జనం మధ్యనే ఉంటున్నారు. శక్తికి మించి ఖర్చు చేస్తున్నారు. అనుచరగణం ఆలనా పాలన చూస్తున్నారు. మైకులు, వేదికలతో హోరెత్తుతున్నాయి. ఇప్పటికే అధికారికంగా వెలువడిన జాబితాలో వున్నా వివిధ పార్టీల అభ్యర్థులు రోజువారీ ఖర్చును భరిస్తూ వచ్చారు. వచ్చే నెలరోజుల్లోనే తొలి విడతలోనే పోలింగ్ ప్రక్రియ పూర్తవుతుందని అంతా భావించారు. తీరా తాజా షెడ్యూల్ ప్రకారం పోలింగ్ జరిగేందుకు మరో 57 రోజులు ఉండడంతో ఒక్కసారిగా ఎన్నికల బడ్జెట్ తారుమారైంది. ఇంతకాలం పాటు ఈ ఖర్చులను భరించడం సాధ్యమా అంటూ ఇప్పటికే కొందరు కళ్లు తేలేశారు. అభ్యర్థులకు ఈ రెండు నెలలు గడ్డు కాలమే. ఒక్కో అభ్యర్థి దాదాపు రూ.2 కోట్లు నుంచి రూ. 3 కోట్ల వరకు అదనపు ఖర్చు భరించాల్సిందే. ఇది తలుచుకుని వైసీపీయేతర పక్షాలన్నీ బెంబేలెత్తుతున్నాయి. అధికారపక్షం ఎలాగూ ఐరి తెగించి కోట్లు కుమ్మరిస్తోంది. ఎడాపెడా తాయిలాలు విసురుతోంది. కుటుంబాలకు చీరలు పంపిణీ చేశారు. ఎక్కడికక్కడ గుట్టుగా బహుమతుల పంపిణీ సాగుతూ వచ్చింది. పరిస్థితిని అదుపు చేసేందుకు కొందరు ఫిర్యాదు చేసినా ఏ ఒక్కరూ దీనిపై స్పందించలేదు. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార వైసీపీ ఎత్తుగడలు ఇక సాగే అవకాశం లేనేలేదు. ప్రత్యేకించి ఎన్నికల బహుమతుల పంపిణీపై ఎన్నికల సంఘం దృష్టి పెట్టింది. నిఘా అధికారులను రంగంలోకి దింపింది. ఎవరైనా ఉపేక్షిస్తే చాలు అక్కడ వాలి చర్యలు తీసుకోబోతున్నారు. అయినా మిగతా పార్టీ అభ్యర్థులందరికీ ఈ వేసవి అగ్ని పరీక్షే అని అంచనా కడుతున్నారు.

వైసీపీలో కొత్త ..పాత

అధికార వైసీపీ రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను శనివారం అధికారికంగా ప్రకటించింది. ఏలూరు నుంచి ఐదోసారి పోటీ చేసేందుకు వీలుగా ఆళ్ల నానినే ఎంపిక చేశారు. దెందులూరు నుంచి అబ్బయ్యచౌదరి, ఉంగుటూరు నుంచి పుప్పాల వాసుబాబు, కైకలూరు నుంచి దూలం నాగేశ్వరరావు, నూజివీడు నుంచి మేకా వెంకట ప్రతాప అప్పారావు వంటి సిట్టింగ్‌లకే తిరిగి అవకాశం ఇచ్చారు. మరోవైపు ఎస్సీ రిజర్వుడు స్థానమైన చింతలపూడిలో సిట్టింగ్ ఎమ్మెల్యే ఏలీజాను తప్పించి ఆయన స్థానంలో మాజీ రవాణా శాఖ ఉద్యోగి కె.విజయరాజుకు అవకాశం ఇచ్చారు. పోలవరంలోనూ ప్రయోగం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే బాలరాజును తప్పించినట్లే తప్పించి ఆయన సతీమణి రాజ్యలక్ష్మికి ఈసారి టిక్కెట్ ఇచ్చారు. ఏలూరు ఎంపీ స్థానానికి కోటగిరి శ్రీధర్ తప్పుకోవడంతో ఆయనకు బదులుగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనయుడు కారుమూరి సునీల్‌కు అవకాశం ఇచ్చారు. ఎన్నికల్లో పోటీ చేయడం సునీల్‌కుమార్‌కు, రాజ్యలక్ష్మికి కొత్తే. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో పాత మొహాలు ఎక్కువ కావడంతో ఈసారి ఎన్నికలు రసవత్తరంగా మారబోతున్నాయి.

బీజేపీలో కదలిక..

ఏలూరు లోక్‌సభ స్థానం బీజేపీకి కేటాయించాలంటూ శుక్రవారం ఆ పార్టీ పట్టుబట్టి ఆత్మీయ సదస్సుకు దిగడంతో బీజేపీ అధినాయకత్వం తాజాగా దృష్టి పెట్టింది. బలం వున్న చోట్ల పోటీ చేయడం సహేతుకమేనని అది నుంచి ఏలూరు లోక్‌సభ ఆశావహుడు తపన చౌదరి గట్టిగానే వాదిస్తూ వచ్చారు. పొత్తుల ప్రక్రియలో భాగంగా వీరంతా బహిరంగంగా చర్చించేందుకు అవకాశం లేకపోవడంతో ఆయన ఆత్మీయ సదస్సును ఎన్నుకున్నారు. ఏలూరుతో పాటు మరికొన్ని స్థానాలు ఇదే తరహా వ్యతిరేకత కొట్టొచ్చినట్లు కన్పించడంతో బీజేపీ సీనియర్లు పునరాలోచన చేసినట్లు ప్రచారం సాగుతోంది. తపనకే అవకాశం ఇచ్చే దిశగా అడుగు వేస్తారా లేదా అనే ఒకటి రెండురోజుల్లో తేలనుంది.

ఉండి, నరసాపురంలో సీన్ రివర్స్

ఉండి, నర్సాపురం నియోజక వర్గాల్లో రాజకీయ పరిణామాలు గడిచిన మూడు రోజులుగా వేగంగా మారుతూ వచ్చాయి. ఉండి నుంచి టీడీపీ టిక్కెట్ ఆశించిన వేటూకూరి శివరామరాజు వచ్చే ఎన్నికల్లో తాను ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు శనివారం ప్రకటించారు. అంతకు ముందు శివరామరాజును నిలువరించేందుకు టీడీపీ సీనియర్లు విశ్వ ప్రయత్నం చేశారు. చాలాకాలం పాటు వేచి వున్నా పట్టించుకోని నేతలంతా తాను తుది నిర్ణయానికి వచ్చే నాటికి మాత్రం స్పందించడాన్ని శివరామరాజు తేలికగానే తీసుకుని బరిలోకి దిగేందుకుకే వీలుగా తన నిర్ణయాన్ని ప్రకటించారు. మరోవైపు నర్సాపురంలో జనసేనలో చేరిన సీనియర్ నేత, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు శనివారం భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కొందరు ఊహించినట్లుగానే తాను ఎన్నికల బరిలో ఉంటానంటూ కీలక ప్రకటన చేశారు. దీంతో నర్సాపురంలో కొత్త అలజడికి తావిచ్చినట్లయింది.

నగరంలో కోడ్ అమలు

ఏలూరు టూటౌన్ : ఎన్నికల కోడ్ రావడంతో అధికా రులు అప్రమత్తమయ్యారు. నగరంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీల తొలగింపు, ప్రభుత్వ కార్యాల యాల్లో సీఎం జగన్ ఫోటోలను తొలగించే కార్యక్రమం ప్రారంభించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు.



ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏలూరులో ఫ్లెక్సీపై ఉన్న సీఎం జగన్ ఫొటో కనిపించకుండా మూసేస్తున్న సిబ్బంది


గిఫ్ట్ ప్యాక్‌లతో వైసీపీ నేతలు, వలంటీర్ల వివాదాలు

వలంటీర్లకు గిఫ్ట్ ప్యాక్‌లు

ద్వారకా తిరుమల : ఎన్నికల షెడ్యూల్ వెలువడడానికి కొద్దిసమయం ముందు వైసీపీ నేతలు మండలంలోని ఎం.నాగులపల్లిలో ప్రలోభాల పర్వానికి తెరలేపారు. స్థానిక సచివాలయం వద్ద వలంటీర్లకు బహుమతులను పంపిణీ చేయడమే కాకుండా వారితో తన పార్టీకి అనుకూలంగా నినాదాలు చేయించారు. ప్రతీ వలంటీరు తన పరిధిలో 90 శాతం మేర వైసీపీకి ఓట్లు పడేలా కృషి చేయాలని సూచించారు.

పోలవరం వైసీపీ అభ్యర్థి కులంపై విచారణ

బుట్టాయగూడెం : పోలవరం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తెల్లం రాజ్యలక్ష్మి కులంపై స్పందనలో ఫిర్యాదు చేసిన మడకం వెంకటేశ్వరావు నుంచి శనివారం తహసీల్దార్ వెంకటేశ్వర్లు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. రాజ్యలక్ష్మి ఎస్టీ కాదని వెంకటేశ్వరావు కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాల్సిందిగా బుట్టాయగూడెం తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించడంతో శనివారం ఫిర్యాదుదారుడి నుంచి స్టేట్‌మెంట్‌ను తీసుకోగా వెంకటేశ్వరరావు లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పీసా గ్రామసభలు ఏర్పాటు చేసి విచారణ జరిపి వాస్తవాలను బయటకుతీయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆదివాసీ సేన ఆధ్వర్యంలో ధర్నా చేసి స్టేట్‌మెంట్ కాపీల ను తహసీల్దార్‌కు అందశారు. రాజ్యలక్ష్మి మాత్రం తాను ఎస్టీ కోయ కులానికి చెందుతానని, తనపై చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలేనన్నారు. ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

పెదపాడు : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పెదపాడు మండలం వట్లూరులోని సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శనివారం పరిశీలించారు. జేసీ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, డీఆర్వో పుష్పమణిలతో కలిసి స్ట్రాంగ్‌రూంలను పరిశీలించారు. వివిధ అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఆర్డీవోలు ఖాజావలి, అద్దయ్య, భవానీ శంకరి, ముక్కంటి, భాస్కరరావు, ఏవో కాశీ విశ్వేశ్వరరావు, తహసీల్దార్లు పాల్గొన్నారు.


కౌంటింగ్ కేంద్రాల వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కట్టుదిట్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి : కలెక్టర్

ఏలూరు సిటీ : ఎన్నికల ప్రకటన వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తూ క్షేత్రస్థాయి అధికారులతో జేసీ లావణ్యవేణితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా, నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించి రాజకీయ పక్షాల ప్రతినిధుల ఫొటోలు ముద్రించి ఉన్న పోస్టర్లను, ఫొటోలను వాల్ రైటింగ్‌లను తదితరాలను తొలగించినట్లు రేపటి సాయంత్రం కల్లా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ధ్రువీకరణ పత్రం సమర్పించాలని ఆదేశించారు. రానున్న 24 గంటల్లో ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు, పేపర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు , జెండాలు మొదలైనవన్నీ తొలగించాలని ఆదేశించారు. వాల్ రైటింగ్‌లు/ పోస్టర్లు/ పేపర్లు/ కటౌట్లు/ హోర్డింగ్‌లు / బ్యానర్లు/ జెండాలు మొదలైన అన్ని అనధికారిక రాజకీయ ప్రకటనలు పబ్లిక్ ఆస్తుల వద్ద , బస్టాండ్, రైల్వేస్టేషన్ , రైల్వే వంతెనలు , రోడ్‌వేలు, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్ ప్రదేశాలు, ఖాళీలు మొదలైనవి ఎన్నికల ప్రకటన నుంచి 48 గంటలలోగా తొలగించాలన్నారు. ప్రభుత్వ ఖజానా ఖర్చుతో ప్రభుత్వం సాధించిన విజయాలను చూపే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో అన్ని ప్రకటనలు నిలిపివేయాలన్నారు. రాజకీయ నాయకులు, మంత్రులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అన్ని సూచనలు, రాజకీయ కార్యకర్తల ఫొటోలు ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే అన్ని రాష్ట్ర శాఖల అధికారిక వెబ్‌సైట్‌ల నుంచి తొలగించాలన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి , మంత్రులు , ఇతర రాజకీయ కార్యకర్తలతో సహా ప్రభుత్వ భవనాలపై రాజకీయ కార్యకర్తల ఛాయా చిత్రాలు , చిత్రాలు తొలగించాలన్నారు. శిలా ఫలకాలు మొదలైన వాటిలో సీఎం, మంత్రులు, ఇతర రాజకీయ కార్యకర్తల ఫొటోలు సందేశాలు ఉండకూడదన్నారు. విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, బోర్డింగ్ పాస్‌లు, టీకా సర్టిఫికెట్లు, మొదలైన వాటిలో రాజకీయ కార్యకర్తలు / పార్టీల ఫొటోలు లేదా సందేశాలు / చిహ్నాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల పర్యటనల్లో మంత్రులకు ప్రభుత్వ అతిథి గృహాలలో వసతి కల్పించరాదన్నారు. ఎంపీ ల్యాడ్స్, శాసనసభ్యుల నిధులు లేదా ఇతర ప్రభుత్వ పథకాలు కింద నిధులు సమకూర్చిన నీటి ట్యాంకులు, అంబులెన్స్‌లు మొదలైన మొబైల్ వస్తువులపై ఎంపీ, ఎమ్మెల్యే ఫొటోలు ఉంటే వాటిని మూసి ఉంచాలన్నారు. ప్రభుత్వోద్యోగి ప్రవర్తనా నిష్పక్షపాతంగా ఉండాలని, వారు ఏదైనా పార్టీకి లేదా అభ్యర్థిత్వానికి అనుకూలంగా వ్యవహరించకూడదన్నారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఇచ్చే చిక్కీ ప్యాక్‌పై సీఎం జగన్ ఫొటో

చిక్కీల పైనా సీఎం ఫొటోలే !

ఏలూరు ఎడ్యుకేషన్ : ప్రతీదానికి ప్రచారపిచ్చితో ముఖ్యమంత్రి ఫొటో, పార్టీ రంగులతో హోరెత్తిస్తున్న జగన్ ప్రభుత్వ ప్రచారపు ఎత్తుగడలకు సాధారణ ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) బ్రేక్ వేసినట్టయింది. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్న చిక్కీ (వేరుశెనగ పప్పు అచ్చు) ప్యాక్‌పై ముద్రించి ఉండే సీఎం ఫొటో, జగనన్న గోరుముద్ద పేర్లను తొలగించాల్సి ఉంటుంది. జిల్లాలో మధ్యాహ్న భోజన పథకాన్ని మొత్తం 1,909 పాఠశాలల్లో అమలు చేస్తుండగా 99,833 మంది బాలబాలికలు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. ప్రతీ విద్యార్థికి మధ్యాహ్న భోజనంతో పాటు పౌష్టికాహారంగా గుడ్డు, చిక్కీ, రాగి జావలను అందజేస్తున్నారు. దీనికి అదనపు బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించింది. వారానికి మూడు రోజులపాటు సోమ, బుధ, శుక్ర వారాల్లో 25 గ్రాముల బరువుతో కూడిన చిక్కీలను విద్యార్థులకు ఇస్తున్నారు. జగన్ ప్రభుత్వం ప్రచారానికి చిక్కీలను కూడా విడిచిపెట్టలేదు. ప్రతీ చిక్కీ ప్యాక్‌పైనా సీఎం ఫొటోను ముద్రించారు. బెల్లం, వేరుశెనగ పప్పు మిశ్రమంతో తయారుచేసిన చిక్కీలను పాఠశాలలకు పంపిణీ చేయడానికి టెండర్‌పై ఏజన్సీలకు ప్రభుత్వం అప్పగించింది. ఈ ప్యాక్‌లపై సీఎం ఫొటోతో పాటు, జగనన్న గోరుముద్ద పేర్లను ముద్రించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నియమావళి ప్రకారం ఏ ప్రభుత్వ పథకంపైనా సీఎంతో సహా, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకుల ఫొటోలు ఉండకూడదు. ఆ ప్రకారం చిక్కీలపై ముద్రించిన జగన్ ఫొటోలను తొలగించాల్సి ఉంటుంది. అలా తొలగించకుండా చిక్కీలను పంపిణీచేస్తే ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్టే. దీనికనుగుణంగా సీఎం ఫొటోలను చిక్కీల ప్యాక్‌లపై తొలగించి పంపిణీ చేస్తారా? లేదా? అనే దానిపై శనివారం సాయంత్రం వరకు ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి సమాచారం, ఆదేశాలు అందలేదని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

'పది' పరీక్షల్లో పారదర్శకతకు చర్యలు

- టెన్త్ పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు ఆర్.నరసింహారావు



ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 16 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో పారదర్శకత కోసం మరిన్ని కట్టుదిట్ట చర్యలను తీసుకున్నట్లు టెన్త్ పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు ఆర్.నరసింహారావు, డీఈవో ఎస్.అబ్రహం వెల్లడించారు. పరీక్షల నిర్వహణపై స్క్వాడ్ బృందాలతో స్థానిక ఎంఈవో కార్యాలయంలో నరసింహారావు సమావేశం నిర్వహించగా, జిల్లాలో పరీక్షలకు ఏర్పాట్లపై డీఈవో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షల సిబ్బంది విధిగా గుర్తింపు కార్డులను ధరించాలని ఆదేశించారు. పరీక్షలు రాసే విద్యార్థుల్లో తమ కుటుంబ సభ్యులు గాని, సంబంధీకులు గాని లేరని స్పష్టం చేస్తూ సిబ్బంది నుంచి పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ విధిగా సర్టిఫికెట్‌ను తీసుకోవాలని కోరారు. ప్రశ్నాపత్రాన్ని తప్పుగా విద్యార్థికి ఇస్తే ఇన్విజిలేటర్‌పై క్రమశిక్షణా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. లాటరీ పద్ధతిలో ఇన్విజిలేటర్లకు పరీక్ష గదులను కేటాయించాలన్నారు. పరీక్ష ముగిసే వరకు మాల్‌ప్రాక్టీస్ జరగకుండా నిశితంగా పరిశీలించే బాధ్యత ఇన్విజిలేటర్లదేనని స్పష్టం చేశారు.

యూనిఫాం ధరించి రావొద్దు

విద్యార్థులెవ్వరూ స్కూలు యూనిఫాం ధరించి పరీక్షా కేంద్రానికి రాకూడదని డీఈవో సూచించారు. సివిల్ డ్రెస్‌లోనే పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో సహా ఉన్నతాధికారులెవరూ సెల్‌ఫోన్‌తో పరీక్షా కేంద్రంలోకి వెళ్లేందుకు అనుమతిలేదన్నారు. పరీక్ష కేంద్రానికి కేటాయించిన సిబ్బంది మినహా, మిగిలిన ఏ ఒక్కరూ ఉపాధ్యాయులతో సహా పరీక్ష కేంద్రం వద్ద ఉండరాదని హెచ్చరించారు. ప్రతీరోజూ ఉదయం 9.30 గంటలకు విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు ఇవ్వాలని, అందజేసిన ప్రశ్నాపత్రాన్ని చదువుకునేందుకు 15 నిమిషాలు సమయం ఇస్తున్నట్టుగా విద్యార్థులకు తెలపాలన్నారు. అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే మూడు నుంచి ఏడేళ్ల పాటు జైలుశిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారని వెల్లడించారు. పుకార్లు/ అనధికార వార్తలను/గెస్ పేపర్లను సోషల్ మీడియా ద్వారా ప్రచారంచేసే వ్యక్తులపై సైబర్ నేరంకింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఎస్ఎస్‌సీ పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశామని, మొత్తం 24,125 మంది బాల బాలికలు రెగ్యులర్ విభాగంలో, మరో 8,230 మంది ఒకసారి ఫెయిలైన విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించిన కైకరం, రంగాపురం, లక్ష్మవరం, చింతపాడు, కోరుకొల్లు, పిప్పర జడ్పీ హైస్కూళ్లల్లో సీసీ కెమెరాలను అమర్చారన్నారు. విద్యార్థులు హాల్ టిక్కెట్‌ను చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా చేయవచ్చన్నారు. అన్ని కేంద్రాల్లో ప్రథమ చికిత్సా శిబిరాలను ఏర్పాటు చేశామని, ఏ ఒక్క విద్యార్థి నేలపై కూర్చుని పరీక్ష రాయాల్సిన పరిస్థితి తలెత్తకుండా పూర్తిస్థాయిలో ఫర్నీచర్, మౌలిక వసతులున్న కేంద్రాలనే ఎంపిక చేశామన్నారు.

దగాపడ్డ అంగన్‌వాడీలు

- ఉత్తర్వులు గాలికే.. జీవోలు అమలు కాకుండానే ఎన్నికల కోడ్


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్)

ఏలూరు రూరల్, మార్చి 16 : అరకొర వేతనాలతో పని చేస్తున్న అంగన్‌వాడీలు వైసీపీ సర్కార్ చేతిలో దగా పడ్డారు. జిల్లాలో నాలుగు వేలకు పైబడి అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా కార్యకర్తలు, సహాయకులు ఆరు వేలకు పైగా ఉన్నారు. పదకొండు డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా గతేడాది డిసెంబరు 12 నుంచి ఈ ఏడాది జనవరి 21 వరకు నిరవధిక సమ్మె చేపట్టారు. ఎస్మా చట్టానికి భయపడలేదు. ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ బెదిరింపులకు దిగినా భయపడలేదు. గడిచిన ఐదేళ్లలో ఏ శాఖ ఉద్యోగులు చేయని రీతిలో 42 రోజుల పాటు నిరవధిక సమ్మె చేశారు. చివరకు దిగొచ్చిన ప్రభుత్వం డిమాండ్లన్నీ పరిష్కరిస్తామని ఇదిగో అమలు జీవోలు అంటూ మోసపు హామీలతో ఉధృతంగా సాగుతున్న ఉద్యమాన్ని నీరు గార్చింది. వారంతా విధుల్లో చేరి రెండునెలలు గడుస్తున్నా ఏ జీవో అమలుకు నోచుకోలేదు. సమ్మె కాలానికి వేతనం ఇస్తామన్నా ఒక్క హామీ అమలు తప్ప మిగతా జీవోలపై ప్రభుత్వం నోరు మెదపలేదు. మూడేళ్లుగా పేరుకు పోయిన టీఏ, డీఏ బకాయిలు చెల్లిస్తామని జీవో ఇచ్చారు. ఉద్యోగ విరమణ ప్రయోజనం రూ.12 లక్షలు పెంచుతామన్న సవరణ ఉత్తర్వులు రాలేదు. ఆయాలకు 45 నుంచి 50 ఏళ్లకు పదోన్నతిపై ఉత్తర్వులు, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీ అయినా అమలుకు నోచుకోలేదు. కనీస వేతనం పెంపు ఊసేలేదు. మినీ కార్యకర్తలను మెయిన్ కార్యకర్తలుగా మార్పు, సంక్షేమ పథకాల వర్తింపు, మట్టి ఖర్చులకు రూ.20 వేలు చెల్లింపు వంటివాటిపై ఉత్తర్వులు రాలేదు. కీలకమైన వేతనపెంపు, గ్రాట్యుటీ వంటి డిమాండ్లపై ప్రభుత్వం నోరు మెదపలేదు. ఇప్పుడు ఎన్నికల కోడ్ రానే వచ్చింది. ఇక తమ సమస్యలు పరిష్కారం కానట్లేనని, తమను వైసీపీ ప్రభుత్వం దగా చేసిందని, ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని అంగన్‌వాడీలు మండిపడుతున్నారు.


పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, అధికారులు

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

ఏలూరు కలెక్టరేట్, మార్చి 16 : నేటి యువతకు అమరజీవి పొట్టిశ్రీరాములు ఆదర్శప్రాయుడని ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్నిరంగాల్లో రాణించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు జేసీ బి.లావణ్యవేణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహోన్నతవ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు.డీఆర్వో పుష్పమణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, డీఎంహెచ్‌వో ఎస్.శర్మిష్ఠ, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -1 పరీక్షలకు సర్వం సిద్ధం

ఏలూరు కలెక్టరేట్/ ఏలూరు క్రైం, మార్చి 16 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ -1 పరీక్షల నిర్వహణలో భాగంగా ఆదివారం జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. 4,372 మంది అభ్యర్థులకు గాను ఐదు పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్ ఏదైనా ప్రభుత్వ గుర్తింపుకార్డు ఒరిజినల్‌తో పరీక్షా సమయానికి గంట ముందుగా చేరుకోవాలన్నారు. గ్రూప్-1 పరీక్షకు అభ్యర్థుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు ఏ సహాయం కోసమైనా కంట్రోల్ రూమ్ నెంబర్ 94910 41436, సెక్షన్ అధికారి 90145 50879, 93913 34127 నెంబర్‌లలో సంప్రదించవచ్చన్నారు. కాగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏలూరు నగరంలో ట్రాఫిక్‌నకు ఎక్కడా అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

541 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 16 : ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం బ్రిడ్జి కోర్సుల పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయని డీవీఈవో ప్రభాకరరావు తెలిపారు. జనరల్ విభాగంలో దరఖాస్తు చేసుకున్న 102 మంది విద్యార్థుల్లో ఒక్కరూ పరీక్షలకు హాజరు కాలేదన్నారు. ఒకేషనల్ విభాగంలో మొత్తం 1,674 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,295 మంది హాజరయ్యారని వివరించారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.


ఉపాధి వేతనదారులతో ఓటు వినియోగంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో

పోలింగ్ శాతం పెంచడానికి చర్యలు : డీపీవో

ఏలూరు రూరల్, మార్చి 16: రానున్న ఎన్నికల్లో జిల్లాలో పోలింగ్‌శాతం పెంపు లక్ష్యంగా స్వీప్ కార్యక్రమాలు జరుగుతున్నాయని నోడల్ అధికారి, డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గురుకులపేటలో కాలువ పనులు చేస్తున్న ఉపాధి హామీ పథకం వేతనదారులతో శనివారం ఓటు వినియోగంపై సదస్సు నిర్వహించారు. గత ఎన్నికల్లో ఏలూరు జిల్లాలో 83.75శాతం పోలింగ్ నమోదైందని, ఏలూరు నియోజకవర్గంలో అత్యల్పం గా 68.10శాతంగా నమోదైందని తెలిపారు. ఇది అతి తక్కువ అన్నారు. యువత ఓటింగ్ ప్రక్రియలో భాగస్వామ్యం కాకపోవడమే దీనికి కారణమన్నారు. ఎన్నికల్లో గ్రామాల్లో ఉపాధి హామీ వేతనదారులు ఓటువేసి ఓటింగ్‌శాతం పెంచే విధంగా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్ర మంలో ఏపీవో కిషోర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సుమలత, సాంకేతిక నిపుణులు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పెదవేగి: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఎన్ని కల నిబంధనలు పాటించాలని ఎంపీడీవో వెంకట రమణ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజకీయ నాయకులు, ఉద్యోగులు ఎన్నికల నిబంధనలు అనుసరించా లన్నారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నాయకులు బాధ్యత తీసుకోవాలని, అప్పుడే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతాయని ఆమె చెప్పారు. చాలాచోట్ల ఫ్లెక్సీలు ఉన్నాయని, 48గంటల్లోగా వాటిని ఎవరికివారు స్వచ్ఛందంగా తొలగించి, సహకరిం చాలని ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తహసీల్దారు సూర్యప్రభ, వివిధ పార్టీల నాయకులు బొప్పన సుధాకర్, ఉండవల్లి వెంకట్రావు, ఎంబీఎస్.వరప్రసాద్, బొద్దు సతీష్, పొన్నూరు శంకరగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


పెదపాడులో భద్రతా దళాలు, పోలీసు సిబ్బంది కవాతు

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

పెదపాడు, మార్చి 16: స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు పోలీసు యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేసిందని, ప్రతి ఓటరు నిర్భయంగా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కావాలని సీఐ కె.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో భయాందోళన తొలగించి, భద్రతపై అవగాహ న కోసం ఎస్సై కె.శుభశేఖర్ ఆధ్వర్యంలో ఆర్మీ, పోలీసు సిబ్బంది పెదపాడు, పరిసర ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడ కుండా ఉండాలంటూ అవగాహన కల్పించారు.

పేద దళిత కుటుంబానికి న్యాయం చేయాలి


ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 16: పేద దళిత కుటుంబానికి న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ నేత కెవి రమణ కోరారు. ఐఎఫ్ టీయూ, భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. కేవీ.రమణ మాట్లా డుతూ మహాశివరాత్రికి పట్టిసీమలో కరెంటు వైరింగ్ చేస్తున్న పెంటపాటి హర్ష కుమార్ మృతి చెందాడన్నారు. అతడి కుటుంబానికి రెండు ఎకరాల పొలం ఆర్థిక సహాయం చేస్తామని అధికారులు హామీ ఇచ్చి, తర్వాత పట్టించుకోలేదన్నారు. ఆర్డీవో కార్యాలయ ఏవో సోమేశ్వరావుకు వినతిపత్రం అందజేశారు. ఎస్.రామ్మోహ న్, మంచిలి రాజు, తియ్యల గణేష్, ముప్పిడి అబ్బులు, యడ్లపల్లి బొజ్జియ్య, మొల్లేటి శ్రీనివాస్, పీవోడబ్ల్యు నాయకురాలు కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: మహాశివరాత్రి ఉత్సవాలలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెంది న దళిత యువకుడు పెంటపాటి హర్ష కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే పరిహా రం అందజేయాలని మాల మహానాడు అధ్యక్షుడు నల్లి రాజేష్ డిమాండ్ చేశారు. పట్టిసీమలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిహారం అందించడంలో అధికారులు విఫలమయ్యారని, మృతుని కుటుంబానికి 2 ఎకరాల భూమి, రూ.5 లక్షల పరిహారం ఈ నెల 20లోపు అందించాలన్నారు. సొబ్బన మోహన్, గుండె నగేష్‌బాబు, కర్ని జోగయ్య, మోతా నరసింహారావు, జిల్లా కార్యదర్శులు ఏనుగుపల్లి చంద్రశేఖర్, కొయ్యలగూడెం రొక్కాల నాగరాజు, తొర్లపాటి శ్రీనివాస్, తండా ఇస్సాకు రాజు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ థెరిస్సా విద్యార్థినుల స్టడీ టూర్


సంస్థ కార్యకలాపాలు వివరిస్తున్న ప్రతినిధులు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 16: సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఎంబీఏ విద్యార్థినులు స్టడీ టూర్‌లో భాగంగా శనివారం తాళ్ళపూడిలోని ప్రముఖ ఫార్మా కంపెనీ రాగూర్ లేబరేటరీస్‌ను సందర్శించారు. ఔషధ తయారీలో అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞా నం, కంపెనీ నిర్వహణ ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు స్టడీ టూర్ ఉపకరిస్తుందని ప్రిన్సిపాల్ మెర్సీ తెలిపారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను అంచనావేయడానికి ఎంబీఏ విద్యార్థినులు ఈ సందర్శన ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నారని అధ్యాపకులు హెప్సిబా, విజయలక్ష్మి, భువనేశ్వరి వివరించారు.

కైకరంలో కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ



రోశయ్య విగ్రహావిష్కరణ ఆర్యవైశ్య నేతలు

ఉంగుటూరు, మార్చి 16: ఆర్య వైశ్యులతో పాటు రాష్ట్రాభివృద్ధికి పాటు పడిన కొణిజేటి రోశయ్య సేవలు ఎనలేనివని పలువురు అన్నారు. ప్రపంచ ఆర్యవైశ్య సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీని వాసరావు, హనుమాన్‌బాబు ఆర్థిక సహకారంతో కైకరం వంతెన వద్ద ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని మారం వెంకటేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. ఒబిలిశెట్టి నటరాజ్, జిల్లా అధ్యక్షుడు నున్న ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహానికి సంఘ నాయకులు గ్రామస్తులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

వేములపల్లిలో ఆక్రమణల తొలగింపు

లింగపాలెం, మార్చి 16: వేములపల్లిలో డ్రైనేజిని ఆక్రమించి చేపట్టిన నిర్మా ణాలను ఎంపీడీవో రాంబాబు ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. గ్రామంలో కొందరు డ్రైనేజీపై షాపులు నిర్మించడంతో వరద నీరుపోవడానికి ఆటంకం కలుగుతోంది. దీనిపై కొందరు గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆక్రమణలను అధికారులు తొలగించారు. తొలగింపు కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జేఎం.రత్నకుమార్, పంచాయతీ కార్యదర్శి హవేల, అధికారులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం సర్వ మానవాళికి ఆచరణీయం


క్రీస్తు బోధ చేస్తున్న ఫాదర్ ఇన్నయ్య

పెదవేగి, మార్చి 16: క్రీస్తు చూపిన మార్గం సర్వ మానవాళికి ఆచరణీయమని ఫాదర్ ఇన్నయ్య అన్నారు. న్యాయంపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న క్రీస్తు మహాసభలు శనివారం ముగిశా యి. ఫాదర్ ఇన్నయ్య మాట్లాడు తూ క్రీస్తు చూపిన బాటలో నడిస్తే సన్మార్గం అనుసరించడానికి వీలవుతుందన్నారు. క్రీస్తు లోకానికి వెలుగు పంచాడని, ఆయన అనుసరించిన వెలుగు బాటలో ప్రతిఒక్కరూ పయనించి, ముక్తిని పొందాలని ఆయన సూచించారు. న్యాయంపల్లి విచారణ గురువు ఫాదర్ రాచూరి బాలస్వామి, ఫాదర్ మర్రెడ్డి, గురువులు, విశ్వాసులు పాల్గొన్నారు.


ఏలూరులో ప్రజా సంకల్పయాత్రలో బడేటి చంటి, నేతలు

రాష్ట్రానికి గ్రహణం వీడింది

● ఎన్నికల షెడ్యూల్ విడుదలతో టీడీపీలో ఉత్సాహం ● పార్టీ శ్రేణులతో కలసి ప్రచారానికి సమాయత్తం

ఏలూరు టూటౌన్, మార్చి 16: ఎన్నికల నోటిఫికేషన్‌తో జగన్మోహన్‌రెడ్డి రూపంలో రాష్ట్రానికి పట్టిన గ్రహణం తొలగిపోయిందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఏలూరు నియోజకవర్గ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో పవర్‌పేట బడేటి కార్యాలయంలో శనివారం బాణసంచా కాల్చారు. టీడీపీ కూటమి విజయం తథ్యమని నినా దాలు చేశారు. చంటి మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనకు తెర పడింద న్నారు. జగన్ పాలనలో ఐదేళ్ల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. ఎన్నికల తర్వాత రామరాజ్య స్థాపన జరుగుతుందన్నారు. పూజారి నిరంజన్, గూడవల్లి వాసు, చోడే వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

అన్నయ్యకు ఓటు వద్దంటున్న చెల్లెళ్లు

సీఎం జగన్ చెల్లెళ్లు షర్మిల, సునీతలు మా అన్నకు ఓటేయొద్దని చెబు తున్నారని జగన్ ఎంత దుర్మార్గుడో అర్థం చేసుకోవాలని చంటి అన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 24, 25, 45 డివిజన్‌లో పర్యటించారు. బాబాయ్‌ని హత్య చేసిన వారికి శిక్షపడకుండా జగన్ కాపాడుతున్నాడంటే ఇంత కంటే దుర్మార్గం ఏదైన ఉంటుందా అని ప్రశ్నించారు. తల్లికి, చెల్లెళ్లకు న్యాయం చేయ్యలేని వ్యక్తి రాష్ట్ర ప్రజలకు ఏం మేలు చేస్తారని అన్నారు. కార్యక్రమంలో వందనాల శ్రీనివాసరావు, వందనాల దుర్గాభవాని, శ్రీనివాస్, జుంజు మోజేష్, మాణిక్యాలరావు, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

నగరంలో పలువురు ప్రముఖులు, నాయకులు టీడీపీ వైపు చూస్తున్నారు. నిన్న మొన్నటి దాక వైసీపీలో ఉన్న పెద్ద నేతలు టీడీపీలో చేరుతున్నారు. ఇప్పటికే పలువురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మాజీ చైర్‌పర్సన్ మధ్యాహ్నం ఈశ్వరి, బలరామ్ దంపతులు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు పలికారు. బడేటి చంటి శనివారం బలరామ్ దంపతుల స్వగృహానికి వెళ్లి ఆత్మీయ భేటి నిర్వ హించారు. వారిని పార్టీలో చేరాలని చంటి ఆహ్వానించారు. త్వరలోనే టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరేందుకు ఈశ్వరి బలరామ్ దంపతులు సుముఖత వ్యక్తం చేశారని చంటి తెలిపారు.

సొంగా రోషన్ క్యాంప్ కార్యాలయం ప్రారంభం

జంగారెడ్డిగూడెం టౌన్: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి చింతల పూడి అభ్యర్థి సొంగా రోషన్ క్యాంప్ కార్యాలయాన్ని శనివారం ప్రారంభిం చారు. శనివారం మధ్యాహ్నం మద్ది ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి చింతలపూడి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాల నుంచి జనసేన, టిడిపి కార్యకర్తలు భారీగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయంవద్ద నిర్వహించిన సమావేశంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని రోషన్ అన్నారు.


నాయకులు, కార్యకర్తలతో కలిసి రోషన్‌కుమార్ ర్యాలీ

టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీ సోదరులు

కామవరపుకోట మండలం తూర్పు యడవల్లి గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీ సోదరులు కోటగిరి కిషోర్, కోటగిరి వేణు, చదలవాడ రామకృష్ణ టీడీపీలో చేరారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరంజనేయులు, జనసేన పార్టీ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ జగ్గవరపు ముత్తా రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాంచంద్రశేషు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, కోనేరు సుబ్బారావు, మండవ లక్ష్మణరావు, గోరుముచ్చు గోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాఘూరి కృష్ణ, ఆకుమర్తి రామారావు, షేక్ ముస్తఫా, పె


టీడీపీలో చేరిన కోటగిరి కిశోర్, చదలవాడ రామకృష్ణ, తదితరులు

నుమర్తి రామ్‌కుమార్, పరిమి సత్తిపండు, చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిషోర్, ఇస్మాయిల్, సాయిల సత్యనారాయణ, వగడం సౌభాగ్యవతి, జనసేన మండ ల అధ్యక్షుడు పులి శివ, షేక్ పీరు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో పాల్గొన్న కక్షిదారులు, న్యాయవాదులు, అవార్డు కాపీని అందిస్తున్న న్యాయాధికారి మంగకుమారి

లోక్ అదాలత్‌తో కేసుల నుంచి విముక్తి

ఏలూరు క్రైం, మార్చి 16: కోర్టు కేసుల నుంచి విముక్తి పొందడానికి కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్ మంచి వేదికని రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి పి.మంగకుమారి తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ భవ నంలో జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా శనివారం న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంగకుమారి మాట్లాడుతూ కోర్టు కేసుల నుంచి విముక్తి పొందడానికి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకో వాలన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఏలూరు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బు, సమయం వృధా చేయకుండా, పట్టింపులకు పోకుండా రాజీతో కేసుల నుంచి విముక్తి పొందాలని తెలిపారు. న్యాయమూర్తి కేవీ బుల్లికృష్ణ, ప్రభుత్వ న్యాయవాది బీజే.రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతా రాం, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎన్ఎంఎం నాగరాజు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, తదితరులు జాతీయ లోక్ అదాలత్ గురించి వివరించారు. అనంతరం లోక్ అదాలత్‌లో పరిష్కరించిన వాహన ప్రమాద నష్టపరిహారం కింద బీమా కంపెనీ ద్వారా రూ.10 లక్షల చెక్కును మంగకుమారి కక్షిదారులకు అందజేశారు. బీమా కంపెనీ మేనేజర్ టి భాస్కర్ సంబంధించిన స్టాండింగ్ కౌన్సిల్ కెవిఆర్‌కె సుబ్బారావు పిటిషనర్స్ తరఫున బి.రంగారావు కేసును రాజీ చేశారు. కార్యక్రమంలో న్యాయ మూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నివారణపై సమీక్ష

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 16: గర్భిణుల్లో హైరిస్క్ వున్నవారిని గుర్తిం చి సకాలంలో వైద్యం అందించడం ద్వారా జిల్లాలో మాతా శిశు మరణాలను తగ్గించాలని జిల్లా వైద్యాధికారి శర్మిష్ట సూచించారు. ఏలూరులో మాతా శిశుమరణాలపై పీహెచ్‌సీల వైద్యాధికారులు, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పీలతో శనివారం సమావేశం నిర్వహిం చారు. నిర్ణీత యాప్‌లో గర్భిణుల ఆరోగ్య వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ విజయలక్ష్మి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి గైనకాలజీ విభాగం వైద్యురాలు లిటోర్నదేవి, బ్లడ్‌బ్యాంకు నోడల్ ఆఫీసర్ పావని, ఎనస్థిస్టు డాక్టర్ విజయ్‌కుమార్, డీపీహెచ్ఎన్‌వో జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్ కళాశాల వార్షికోత్సవం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 16: సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం శనివారం కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ముఖ్యఅతిథి డీవీఎస్.రాజు మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. తల్లిదండ్రులు, గురువులకు, దేశానికి గర్వకారణంగా ఎదగాలన్నారు. క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులను, పతకాలను అందజేశారు. పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను ఇచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అల్లూరి బాపి నీడు 113వ జయంతిని పురస్కరించుకుని ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధ్యా పకులు ఫణికుమార్, రవికుమార్‌కు అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. కరస్పాండెంట్లు విష్ణుమోహన్, కలగర శివరామకృష్ణప్రసాద్, కానాల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో వంద కేసులు పరిష్కారం

చింతలపూడి, మార్చి 16: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో వంద కేసులు పరిష్కారమైనట్లు కోర్టువర్గాలు తెలిపాయి. క్రిమినల్ కేసులు 64, చెక్‌బౌన్స్ 4, మద్యం కేసులు 10, సివిల్ కేసులు 6, మనోవర్తి కేసులు 2, బ్యాంకు రికవరీ 1, టెలిఫోన్ బకాయిలు 13 పరిష్కారమైనట్లు తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి సి.మ ధుబాబు చట్టాల గురించి కక్షిదారులకు వివరించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సామయ్య, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, బెంచ్ సభ్యులు పట్నాల శ్రీనివాస్, ఎండీ అక్బర్‌అలీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట సభ విజయవంతం చేయాలి

ఉంగుటూరు, మార్చి 16: చిలుకలూరిపేటలో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి బహిరంగ సభ జరగనుందని, నరేంద్రమోదీ పాల్గొనే సభను విజయవంతం చేయాలని ఉంగుటూరు నియోజవర్గ ఉమ్మడి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. ఉంగుటూరులో జనసేన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. నరేంద్రమోదీ, పవన్ కల్యాణ్, చంద్రబాబునాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొనే సభకు జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు అధిక సంఖ్యలో రావాలన్నారు. భీమడోలుకు చెందిన కిరణ్‌బాబు, తదితరులను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తోట శ్రీను, నిమ్మల దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

కాగుపాడులో దాత సాయంతో అభివృద్ధి పనులు

ఉంగుటూరు, మార్చి 16: మండలంలోని కాగుపాడు గ్రామాభివృద్ధికి ప్రముఖ క్రికెటర్, దాత వంకిన చాముండేశ్వరీనాథ్ ఆయన తల్లిదండ్రులు వెంకట రాజేశ్వర ప్రసాదరావు, అంజనాదేవి జ్ఞాపకార్థం రూ.30 లక్షలతో అభివృద్ధి పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. సర్పంచ్ కడియాల సుదేష్ణ జానకిరాం, శ్రీరామకృష్ణ ప్రతాప్ వాటర్ ప్లాంట్, హైస్కూలు ప్రహరీ, ముఖ ద్వారం, వేదిక, సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. దాతకు గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ధన్యవాదాలు తెలిపారు. హెచ్ఎం ఎం.ఉమాదేవి, మాజీ సర్పంచ్ కడియాల రవి శంకర్, వంకిన ధర్మరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆనందరావు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు భరోసా పరీక్ష పే చర్చ

ద్వారకాతిరుమల, మార్చి16 : 'పరీక్ష పే చర్చ' కార్యక్రమం విద్యార్థుల భవితకు భరోసానిచ్చిందని పంగిడిగూడెం జడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం పి.సురేష్ అన్నారు. ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న 9వ తరగతి విద్యార్థి కొత్తపల్లి అనిల్, తెలుగు ఉపాధ్యాయుడు మద్దాల పెద్దిరాజును అభినందిస్తూ పీఎం కార్యాలయం నుంచి ఆన్‌లైన్‌లో పంపిన ప్రశంసాపత్రాలను హెచ్ఎం చేతుల మీదుగా అందుకున్నారు.

జగదాంబ ఆలయ వార్షికోత్సవం

జీలుగుమిల్లి, మార్చి 16: జీలుగుమిల్లి గ్రామ ఇలవేల్పు జగదాంబ ఆలయ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే బాలరాజు, ఎంపీ కోటగిరి శ్రీధర్ సోదరి అనిత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కక్కిరాల రాము, బోదా శ్రీనివాసరెడ్డి, చ్ఛాట్రాతి భవానీశేఖర్, మొడియం రామచందరావు, చిర్రి మోహన్ అర్చకులు ప్రసాద్ హరికృష్ణ ఉన్నారు.




ఏలూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద ఏఎస్పీ స్వరూపరాణి నివాళి, చింతలపూడి, లింగపాలెంలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

అమరజీవి పొట్టి శ్రీరాములు

ఏలూరు క్రైం, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని ఏఎస్పీ జిస్వరూపరాణి అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహిం చారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరాములు త్యాగంతో స్వాతంత్ర్య సమరయోధుడిగా, విప్లవకారుడిగా గౌర వించబడి అమరజీవిగా కీర్తి గడించారన్నారు. 58 రోజుల నిరాహారదీక్షతో ఆయన మరణించిన మూడు రోజుల తరువాత ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటును అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారన్నారు. ఏఆర్ ఆర్ఐ పవన్‌కుమార్, డీసీఆర్బీ సీఐ సుబ్బారావు, మహిళా ఎస్ఐ జాస్మిన్, మహిళా ఏఎస్ఐలు కృప, సిసిలి, హెడ్ కానిస్టేబుల్ రత్నకుమారి, రాధ, అడ్‌హక్ పోలీస్ సంఘ అధ్యక్షులు నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేని దని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లులానీ నగర్‌లో ఆర్యవైశ్యుల కమ్యూనిటీ హాల్ భవనానికి ఎమ్మెల్యే నాని శంకుస్థాప న చేశారు. పేదలను ఆదుకునేందుకు ఆర్యవైశ్య సంఘం నాయకుల కృషిని అభినందించారు. అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావు, అధ్యక్షుడు దివ్వెల జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి వి.సురేష్‌కు మార్, మద్దుల రవికుమార్, బచ్చువిష్ణు, చలువాది పవన్‌కుమార్, కూరాళ్ళ రమాదేవి, ఒబిలి శెట్టి శ్రవణ్‌కుమార్‌గుప్తా, గుడివాడ రామచంద్రకిషోర్, మద్దుల సత్యకుమా ర్, నేరెళ్ళ రాజా, రామారావు తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: స్థానిక బోసుబొమ్మ సెంటర్, ఫైర్‌స్టేషన్ సెంటర్లలో పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పట్టణ ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు వజ్రపు శేఖర్ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలమే దేశంలో భాషా సం యుక్త రాష్ట్రాలు ఆవిర్భవించాయన్నారు. సభ్యులు కొనకళ్ళ ప్రసాద్, వెంకట రమణ, విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు, ఈశ్వర్, పొట్టి సత్యం పాల్గొన్నారు.

● లింగపాలెం: ధర్మాజీగూడెంలో వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం నిర్వహించారు. విగ్ర హానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భాషా ప్రయుక్త రాష్ట్రంకోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదన్నారు. పోమిశెట్టి గంగాధర రావు, కందుల రత్నమాల, సమయమంతుల బలరామకృష్ణ, కొలిపర్తి పుష్ప కుమారి, మన్యం పుల్లేశ్వరరావు, సమయమంతుల రమాదేవి, బోనగిరి ప్రకా శరావు, కందుల కాస్తులు, శ్రీరాములు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

● పెదవేగి: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రజల హృదయాల్లో ఎప్పటికీ అమరుడేనని ఆర్యవైశ్య సంఘం వాసవీక్లబ్ పెదవేగి అధ్యక్షుడు కొనకళ్ళ నాగేశ్వరరావు అన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. తెలుగు జాతి గౌరవాన్ని నిలిపిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన స్ఫూర్తిగా ప్రతిఒక్కరూ ముందుకెళ్లాలని ఆయన సూచించారు. కందుల బలరామకృష్ణ, కొనకళ్ళ బలరామకృష్ణ, పాపారావు, కృష్ణబాబు, ముంగిర వెంకటేశ్వరరావు, కాశీబాబు, సత్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


షైనోగ్రఫీ పూర్వ విద్యార్థులు

ఏలూరు కల్చరల్, మార్చి 16: వారంతా 1971-72లో ఏలూరు జిల్లా స్థాయి శిక్షణ కేంద్రంలో షైనోగ్రఫీలో శిక్షణ పొం దారు. అనంతరం ఉద్యోగ, వ్యాపార, ఇతర ప్రాంతాల్లో వారంతా స్థిరపడ్డారు. 43 ఏళ్ల తరువాత మళ్లీ శనివారం కలుసుకున్నారు. రామచంద్రరావు పేటలోని మార్కండేయ వేదపాఠశాల వారి అపూర్వ కలయికకు వేదిక అయింది. ఆత్మీయ పలకరింపులతో నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. శిక్షణ సమయంలో జ్ఞాపకాలతో సంతోషంగా గడిపారు. జీఎస్ఆర్ శర్మ, శ్రీరామరెడ్డి, పీవీ.గంగాధరరావు, జి.జ్యోతిర్మయి, టి.గంగాధరం, ఫణిభూషణ చారి, సీహెచ్.సూర్యనారాయణ, ఎన్.మోజేష్, వైవీ.సుబ్బారావు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

బుట్టాయగూడెం, మార్చి 16: పదో తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో టి.బాబురావు తెలిపారు. ఈ ఏడాది ఒక పరీక్షా కేంద్రం అదనంగా వచ్చిం దన్నారు. మండలంలోని 18 పాఠశాలల నుంచి 701 మంది పరీక్షలకు హాజరు కానున్నారని, బాలురు 299 మంది, బాలికలు 402 మంది ఉన్నారు. 18 పాఠశాలల్లో 12 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, 2 జడ్పీ, 2 ప్రవేటు, మరో 2 రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. గతంలో కెఆర్ పురంలో గురుకుల బాలుర పాఠశాల, బూసరాజుపల్లిలో గురుకుల బాలికల పాఠశాల, బుట్టాయగూడెంలో జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఉండగా అదనంగా బూసరాజుపల్లిలోని గురుకుల బాలికల కళాశాలలో నూతనంగా పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

● పెదపాడు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు చర్యలు తీసుకున్నామని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎంఈవో సత్యవతి నరసింహామూర్తి తెలిపారు. పెదపాడులోని పలు పాఠశాలల్లో విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని శనివారం పరిశీలించారు. 11 ప్రభుత్వ 10 ప్రైవేటు పాఠశాల్లో మొత్తం 1625 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారన్నారు. మండలంలో ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి ఏడుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, 10 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 61 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేశారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తుతో పాటుగా ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ అందుబాటులో ఉంటుందని ఎంఈవో నరసింహామూర్తి తెలిపారు.

చదువుకు పేదరికం అడ్డం కాకూడదు


పరీక్ష సామగ్రి అందిస్తున్న అజయ్‌బాబు

ఏలూరు టూటౌన్, మార్చి 16: చదువుకు పేదరికం అడ్డం కాకూడదని మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఆడుసుమిల్లి నిర్మల, అధ్యక్షుడు నేతల అజయ్‌బాబు అన్నారు. బ్రిటస్ నగర్ ఐసీఎం స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు దాతల సాయంతో శనివారం పరీక్ష సామగ్రి అందించారు. ప్రతిభ ఉంటే చదువులో ఉన్నత శిఖరాలు సాధించవచ్చని అన్నారు. ప్రతీ విద్యార్థి సమాజ సేవకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో రమాదేవి, రాణి, స్వామి, బ్యూల, మోషే, నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

● నిడమర్రు: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో పి.శేషు అన్నారు. పెదనిండ్రకొలను పాఠశాలలో 62 మంది విద్యార్థులకు గుణ్ణం బుల్లబ్బాయి సహకారంతో పరీక్షా సామగ్రి శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె.రాంబాబు, హెచ్ఎం సత్యనా రాయణ, మోహన్‌రెడ్డి, జాకబ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

ద్వారకాతిరుమల, మార్చి16: అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీ యుడని వాసవీ క్లబ్ సభ్యులు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి పురస్కరించుకుని తిరుమలంపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం 300 మంది విద్యార్థులకు వాసవి క్లబ్ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 16: మండలంలోని చక్రదేవరపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ సాయిల సత్యనారాయణ, జడ్పీటీసీ బాబ్జి శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఎర్రకాలువ రిజర్వాయర్ ఏపీ టూరిజం పర్యాటక కేంద్రం రిసార్ట్స్ వద్ద ఉపాధి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజచేశారు. ఎంపీడీవో కేవీ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో అల్లరి మూకలు

మోటార్ బైక్‌లపై యువకుల విన్యాసాలు

వేగంగా వెళుతూ రోడ్లపక్కన దుకాణాల్లో చోరీలు

ఏలూరు క్రైం, మార్చి 16: జిల్లా కేంద్రమైన ఏలూరు నగరంలో అల్లరి మూకలు హడలెత్తిస్తున్నారు. ఉన్నతాధికారులతో పాటు వందలాది మంది పోలీసులుండే నగరంలో ఆకతాయిలు రెచ్చిపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. శాంతిభద్రతల పరిరక్షణకు మూడు లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. చీమచిటుక్కు మంటే పనిగట్టడానికి పోలీస్ వేగులు ఉన్నాయి. ఇలాంటి నగరంలో చీకటి పడితే అల్లరి మూకల జోరు పెచ్చుమీరుతోంది. వన్‌టౌన్ ప్రాంతంలోని ఇరుకురోడ్లనే వాళ్ల ఆగడాలకు అడ్డాగా మార్చుకు న్నారు. చీకటి పడితే ఒక బైక్‌పై ఇద్దరు యువకులు అత్యంత వేగంగా తిరుగుతూ తోపుడుబళ్లపై ద్రాక్షపండ్లు, ఇతర పండ్లను అకస్మాత్తుగా ఎత్తుకుపోతారు. రోడ్ల పక్కన అరుగులపై దుకాణాలు, కిళ్లీ షాపుల ముం దు చాక్లెట్ డబ్బాలు, డ్రింక్ బాటిల్స్ ఆకతాయిలు బైక్ వెళుతూ క్షణాల్లో పట్టుకుపోతున్నారు. కన్నుమూసి తెరచేలోపే జరిగే ఈ సంఘటనలతో వ్యాపారులు అవాక్కైపోతున్నారు. చిన్న చిన్న వస్తువులే పోతున్నాయని వ్యాపారులు ఫిర్యాదు చేయకపోవడంతో వారి ఆగడాలు మరింత పెచ్చు మీరాయి. ఏలూరు శనగపప్పు బజార్, సేట్‌మాల్ కంపెనీ ఎదురుగా ఈ సంఘటనలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. ఒక మహిళ పనిలో నుంచి క్యారేజీ బ్యాగ్‌తో ఇంటికి వెళుతుండగా క్యారేజీ బ్యాగ్‌ను లాగేశారు. జిల్లా కేంద్రం ఏలూరు నగరంలోనే అల్లరిమూకల జోరుతో వ్యాపారులు భయ భ్రాంతులవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అల్లరిమూక జోరుకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

దేవుడా..

చినవెంకన్న క్షేత్రంలో భక్తులకు ఇక్కట్లు



టోల్‌గేట్ వద్ద వాహనాలు

కౌంటర్ల బయట టికెట్‌లు ఇస్తున్న సిబ్బంది

ద్వారకాతిరుమల కేశఖండన శాల కౌంటర్ వద్ద భక్తులు

సాంకేతిక లోపంతో సర్వర్‌డౌన్..

» గంటల తరబడి కౌంటర్ల వద్ద వేచి వున్న భక్తులు

ద్వారకాతిరుమల, మార్చి16: శ్రీవారి క్షేత్రంలో సర్వర్ డౌన్ కావడంతో ఆలయానికి వచ్చిన భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి తీవ్ర ఇబ్బందులపాలయ్యారు. ప్రతీ శనివారం మాదిరిగా క్షేత్రానికి వేలాదిమంది భక్తులు విచ్చేశారు. ఈక్రమంలోనే ఆలయానికి వచ్చిన యాత్రికులకు కంప్యూటర్ ద్వారా టికెట్లను అందించే క్రమంలో సర్వర్ సాంకేతిక లోపం కారణంగా ఒక్కసారిగా డౌన్‌అయింది. సరిగ్గా పనిచేయకపోవడంతో కేశఖండనశాల, ప్రసాదాల కౌంటర్ల వద్ద భక్తులు క్యూలైన్లలో నిలబడిపోయారు. మాన్యువల్ పద్ధతిలో టికెట ను అందజేస్తున్నా భక్తుల తాకిడి కారణంగా సకాలంలో ఇవ్వలేక పోవడం వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లల తల్లులు క్యూలైన్లలో నిలబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టోల్‌గేట్ వద్ద వాహనాలునిలిచి పోవడంతో ఆప్రాంతం రద్దీగా మారింది. సిబ్బంది మాన్యువల్‌గా టికెట్లను అందించారు. ఆలయంలో సైతం కౌంటర్ల బయట సిబ్బంది మాన్యువల్‌గా టికెట్లను ఇచ్చి డబ్బులు కవర్లలో వేశారు. చాలాసేపటి తరువాత సర్వర్ పనిచేయడంతో టికెట్లను అందించారు.



శనివారం అనివేటి మండప ప్రాంగణంలో భక్తులు

భక్తుడిపై శునకం దాడి

» ఊడి పడిన వేలి చివరి భాగం.. ఆసుపత్రికి తరలింపు..

ద్వారకాతిరుమల, మార్చి16: శ్రీవారి దేవస్థానం వకుళమాత అన్నప్రసాద భవనం వద్దకు వెళ్లిన ఓ భక్తుడిపై శునకం దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం జరిగినా శనివారం వెలుగు చూసింది. ఉండి మండలం పెదపుల్లేరుకు చెందిన శ్రీనివాసవర్మ కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనానికి విచ్చేశారు. దర్శనానం తరం అన్నప్రసాదానికి సంబంధిత భవనం వద్దకు వెళ్లారు. ఇదే సమయంలో అక్కడ ఉన్న ఓ కుక్క అతడిపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచింది. వేలు చివరి భాగం ఊడి పడడంతో హడలెత్తిన కుటుంబం బాధితుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఆలయ పరిసరాల్లో శునకాలు

క్షేత్రపరిసరాల్లో శునకాలు సంచరిస్తున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. కొన్ని శునకాలు రోగాల బారిన పడి క్షేత్ర పరిసరాల్లో సంచరిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.



రోగాల బారిన పడిన శునకం

తెగిన వేలును చూపుతున్న భక్తుడు

అనివేటి మండపంలో సంచరిస్తున్న శునకం

అనియత విద్య సిబ్బందికి ఎంటీఎస్ నియామకాలపై కసరత్తు

» ఉమ్మడి పశ్చిమ జిల్లాలో సమాచార సేకరణకు ఆదేశాలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 16:బాల కార్మికులకు రాత్రిపూట బడుల్లో విద్యనందించేందుకు దశాబ్దాల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఏర్పాటైన అనియతవిద్య (నాన్‌ఫార్మల్ ఎడ్యుకేషన్) కేంద్రాల్లో పనిచేసిన సిబ్బందిని తాజాగా స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ఖాళీగా వున్న పార్ట్‌టైం ఉపాధ్యాయ పోస్టులు, ఎంటీఎస్ టీచర్లుగా నియమించే ప్రక్రియ నిమిత్తం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మండలాల వారీగా ప్రస్తుతం వున్న అనియతవిద్య సిబ్బంది వివరాలను ఈనెల 20వ తేదీలోగా సేకరించి పంపాలని సమగ్రశిక్ష జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. ఈ మేరకు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి జిల్లాకు ఉత్తర్వులను పంపారని ఏపీ నాన్ ఫార్మల్ ఎడ్యుకేషన్ స్టాఫ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గౌరవవేతనంపై పనిచేసే అనియతవిద్య ఉపాధ్యాయ, సూపర్‌వైజర్ సిబ్బందిని 2001 మార్చి 31న నిలిపి వేశారని, ఉభయ తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత కూడా తమ ఉద్యోగాలకోసం ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నప్పటికీ పట్టించుకోలేదని ఆరోపించారు. అనియత విద్యా పథకం కింద ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 1200 మంది సిబ్బంది ఉండగా, వీరిలో పలువురు చిన్నపాటి ఉద్యోగాలు, ఇతర వృత్తులకు తరలిపోయారని, ప్రస్తుతంవున్న వారిలో గతంలో పనిచేసిన 80మంది సూపర్ వైజర్లు, 220 మంది ఇన్‌స్ట్రక్టర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారని వివరించారు. ఇటీవల తాము విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలుసుకుని తమను డీఎస్సీ-1998 ఉపాధ్యాయుల మాదిరిగా కనీస వేతనస్కేలు (ఎంటీఎస్)పై నియమించాలని చేసిన అభ్యర్థనపై సానుకూలంగా స్పందించి, ఎస్ఎస్ఏ రాష్ట్ర అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఈక్రమంలో జిల్లాల వారీగా అనియత విద్య పథకంలో పనిచేసిన సిబ్బంది వివరాలను తక్షణమే పంపాలని డీఈవోలకు, సమగ్రశిక్ష ఏపీసీలకు ఉత్తర్వులు జారీచేసిందని వివరించారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఎంఈవోల ద్వారా పూర్తి సమాచారాన్ని రప్పించుకుని ఎస్పీడీకి పంపాలని శనివారం డీఈవో అబ్రహంను కలిసి కోరామన్నారు. దీనిపై సమగ్రశిక్ష జిల్లా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నిట్ ఆచార్యుడు రాముడికి జాతీయ ప్రాజెక్టు



పెంటపాడు, మార్చి 16 : ఏపీ నిట్‌లో సేవలందిస్తున్న ఆచార్యుడు డాక్టర్ మాచవరపు రాముడికి సుమారు రూ.25 లక్షల విలువైన జాతీయ ప్రాజెక్టు మంజూరవ్వడం అభినందనీయమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి కొనియాడారు. ఈ మేరకు శనివారం ఆచార్యుడు రాముడుని నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తితో కలసి ప్రత్యేకంగా అభినందించి మాట్లాడారు. స్పింట్రోనిక్ అనువర్తనాల కోసం మాంగనీస్ ఆధారిత యాంటిఫెరో మాగ్నెట్ హ్యూస్లర్ పదార్థాల అభివృద్ధి అనే ప్రాజెక్టుకి సంబంధించి పరిశోధించనున్నారన్నారు. ప్రాజెక్టు నిధులను భారత ప్రభుత్వ ఆధీనంలోని సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు(సెర్బ్), కోర్ రీసెర్చ్ గ్రాంట్ నుంచి కేటాయించారన్నారు. ప్రాజెక్టు పదవీ కాలం మూడేళ్లు ఉంటుందన్నారు. డీన్‌లు డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, డాక్టర్ టి.కురుమయ్య, డాక్టర్ ఎన్.జయరాం, డాక్టర్ జీవీ వీరేష్‌కుమార్, ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి భీమవరంలో టెన్నిస్ టోర్నమెంట్

భీమవరంటౌన్, మార్చి 16 : కాస్మో పాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆలిండియా సీని యర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు భీమవరం కాస్మో పాలిటిన్ క్లబ్‌లో నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు అల్లూరి పద్మరాజు, కార్యదర్శి పెన్మెత్స వెంకటరామరాజు శనివారం తెలిపారు. మెన్స్ డబుల్స్ 35+, 45+,55+,65+,70+,75+విభాగంలో టోర్నమెంట్ జరుగుతుంద న్నా రు. క్రీడాకారులకు ఉచిత భోజనం సదుపాయం కల్పిస్తున్నామని, గత మూడేళ్లుగా ఈ పోటీలను చేపడుతున్నామన్నారు. 18,19 తేదీల్లో క్వాలిఫైయింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలకు భీమవరంలోని కాస్మో, ఎల్‌హెచ్ టౌనహాల్, డీఎన్నార్, ఎస్ఆర్ కేఆర్ కళాశాల క్రాడామైదానంలోని ఎనిమిది కోర్టుల్లో పోటీలు నిర్వహిసామన్నారు. ప్రధాన పోటీలు కాస్మోపాలిటిన్ క్లబ్‌లో చేపడతా మన్నారు. పలు రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. 20న హైదరాబాద్‌కు చెందిన వెర్టెక్స్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వీవీఆర్ వర్మ పోటీలను ప్రారంభిస్తారన్నారు. క్లబ్ సెక్రటరీ వీపీఎస్ సుబ్రహ్మణ్యవర్మ, జాయింట్ సెక్రటరీ కురిశెట్టి సత్యనారాయణమూర్తి, కునపరాజు రామకృష్ణంరాజు, ఎ.రాంబా బు, యుఆర్‌పీఆర్ వర్మ, కేఆర్‌కే రాజు, వీవీ రామరాజు, వీవీఎస్ వర్మ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

భీమవరంటౌన్, మార్చి 16 : పదో తరగతి విద్యార్థులకు ఈనెల 18 నుంచి 30 వరకు జరిగే పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని డిపో మేనేజర్ పి.ఎస్.వి.ఎం.సత్యనారాయణ మూర్తి తెలిపారు. పరీక్ష హాల్ టికెట్ సిబ్బందికి చూపించి ఇంటి వద్ద నుంచి పరీక్ష కేంద్రాలకు ఉచితంగా వెళ్లి రావొచ్చనానరు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఈ సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు



కైకలూరు, మార్చి 11: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు, సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. శనివారం కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ టి. రామకృష్ణ ఆధ్వర్యంలో కైకలూరు మండలం భుజబలపట్నం, పల్లెవాడ, ఆలపాడు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు పాటించాల్సిన విధి విధానాలను సీఐ కృష్ణకుమార్ ప్రజలకు వివరించా రు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

లారీ ఢీకొని నెహ్రూ విగ్రహం ధ్వంసం



చాట్రాయి, మార్చి 16: ఆంధ్ర-తెలంగాణ సరిహద్దులో చాట్రాయి మండలం కృష్ణారావు పాలెం- తెలంగాణ రాష్ట్రం వెంకటాపురం గ్రామాల మధ్య ఉన్న దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాన్ని శుక్రవారం అర్ధరాత్రి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టటంతో ధ్వంసమైంది. రెండు రాష్ట్రాల మధ్య లాండ్ మార్క్‌గా ఉన్న విగ్రహం ధ్వంసం కావటం పట్ల ఇరు రాష్ట్రాల పరిధిలోని సరిహద్దు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన గొర్ల చెన్నారెడ్డి 1965లో ఈ విగ్రహాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఈ విగ్రహం రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దుగా పేరొందింది. అధికారులతో మాట్లాడి మళ్ళీ విగ్రహాన్ని పునః నిర్మించటానికి చర్యలు తీసుకుంటామని వెంకటాపురం గ్రామానికి చెందిన చనుబండ కోదండరామస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పువ్వకాయల చెన్నకేశవరెడ్డి చెప్పారు.

మేరీమాత కానుకల హుండీలో నగదు చోరీ

ఆగిరిపల్లి, మార్చి 16: చిన్నాగిరిపల్లి శివారు సర్నాలగూడెంలోని ఆర్సీఎం చర్చి సమీపంలో మేరీమాత విగ్రహం వద్ద కానుకల హుండీని శుక్రవారం అర్ధరాత్రి దుండగులు పగులకొట్టి నగదు దోచుకున్నారు. చోరీ అయిన సొమ్ము సుమారు రూ.50వేలు వరకు ఉంటుందని, ఈ హుండీ మరి కొద్దిరోజుల్లో తెరుస్తామనగా ఈవిధంగా జరిగిందని కమిటీ నిర్వాహకులు వాపోయారు.

ఎన్నికల వేళ..

» జగనన్న లే-అవుట్‌లో అధికారుల హడావుడి

» ఎన్నికల కోడ్ సమయంలో ఇదేమిటంటూ పలువురు నిలదీత

» ఉన్నతాధికారులకు సమాచారమిచ్చి వెనుదిరిగిన సర్వేయర్లు

వీరవాసరం, మార్చి16 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్న సమయం. మరోపక్క జగనన్న లే-అవుట్ లలో స్థలాలు అప్పగించే ప్రయత్నంలో రెవెన్యూ సిబ్బంది నిమగ్నమయ్యారు. ఇటీవలే లబ్ధిదారులకు స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించి అప్పగించే చర్యలు సాగాయి. అయినప్పటికీ పలు గ్రామాల్లో లబ్ధిదారులకు పూర్తిగా స్థలాలను, రిజిస్ట్రేషన్ కాగితాలను అందించలేదు. శనివారం అధికారులు ఈ ప్రయత్నంలో ఉండగా పలువురు అడ్డుకున్నారు. శనివారం ఉదయం నందమూరుగరువులోని జగనన్న లే-అవుట్‌ను సర్వేచేసి లబ్ధిదారులకు స్థలాలను చూపించేందుకు సర్వేయర్లు లే-అవుట్‌కు వెళ్ళారు. లే-అవుట్ సరిహద్దులను రహదారులను గుర్తించే పనుల్లో ఉండగా అక్కడ స్థలాలు కేటాయించిన కొంతమంది లబ్ధిదారులు తమ స్థలాలను చూపించాలంటూ సర్వేయర్‌లను కోరారు. లబ్ధిదారులకు స్థలాలను కేటాయిస్తున్నారంటూ సమాచారం అందడంతో ఆ లేఅవుట్-లో స్థలాలు కేటాయించిన లబ్ధిదారులు హడావుడిగా అక్కడకు చేరుకున్నారు. ఈ సమాచారం తెలియడంతో జడ్పీటీసీ సభ్యుడు గుండా జయప్రకాష్‌నాయకుడు, జనసేన నాయకులు లే-అవుట్‌కు చేరుకున్నారు. లే-అవుట్‌లో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు ప్లాట్లను కేటాయించి అందించాలని, హడావుడిగా చేయడం తగదని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ వస్తున్న సమయంలో ఇదేమిటంటూ నిలదీశారు. దీంతో సర్వేయర్లు అధికారులకు సమాచారం ఇచ్చి వెనుదిరిగి వెళ్లిపోయారు.



నందమూరుగరువు జగనన్న లే అవుట్‌లో స్థలాల కోసం వచ్చిన లబ్ధిదారులు



సర్వే చేస్తున్న సర్వే సిబ్బంది



మత్స్యపురిలో ఆందోళన చేస్తున్న రైతులు

సాగునీటి కోసం రాస్తారోకో

వీరవాసరం, మార్చి16: చిరుపొట్ట దశలో ఉన్న వరిచేలను కాపాడుకోవడానికి తక్షణం సాగునీరు అందించి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ రైతులు మత్స్యపురిలో ఆందోళనకు దిగారు. శనివారం ఏపీ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు మత్స్యపురి మెయిన్ సెంటర్‌లో రాస్తారోకో చేశారు. వరి చేలో ఎండిన మట్టిగడ్డలతో, వరిని ప్రదర్శిస్తూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివారు ఆయకట్టులో ఉన్న మత్స్యపురికి సాగు నీరు అందడం లేదన్నారు. చేలు నెరలు తీసి వరి ఎండిపోయే స్థితికి వస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. గత 20 రోజులుగా చెరువుల్లో విడిచిన నీటిని, బోరు నీటిని పెట్టి పంటలను రక్షించుకుంటున్నామని చేలు ఎరువురంగుకు చేరుతున్నాయని ఆందోళన చెందారు. కార్యక్రమంలో నిష్పలేటి వెంకటేశ్వరరావు, చింతా నారాయణమూర్తి, గంటా బాబూరావు, యాళ్ళ నాగభాస్కరరావు, దేవిరెడ్డి సూర్యనారాయణ, వినుకొండ రాంబాబు పాల్గొన్నారు.

లేగదూడల ప్రదర్శన.. బహుమతుల పంపిణీ



రైతులకు బహుమతులు అందిస్తున్న అధికారులు

కైకలూరు, మార్చి 16: లేగదూడల పెంపకానికి రైతులు మక్కువ చూపి పాడి పరిశ్రమను అభివృద్ధి పథంలో నడపాలని గన్నవరం పశుగణా భివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ శ్రీని వాస్ అన్నారు. శనివారం వేమవరప్పాడులో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా లేగదూడల ప్రదర్శన నిర్వహించింది. 28 లేగదూడలు పాల్గొనగా మొదటి బహుమతి ఒంగోలు జాతి దూడ పెంపకందారు బీఎస్ వెంకటేశ్వరరావు అనే రైతుకు దక్కగా రెండో బహుమతి ముర్రా జాతి దూడ పెంపకందారు గొల్లేరు సత్యనారాయణ దక్కించుకున్నారు. మూడో బహుమతి ముర్రా జాతి దూడ పెంపకందారు నున్న రాంబాబుకు అందజేశారు. ప్రతి రైతుకు ప్రోత్సాహకాలు, లేగదూడల ఎదుగుదలకు కావాల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కైకలూరు పశుసంవర్ధక శాఖ ఏడీ పఠాన్ ముస్తాఫాఖాన్, పశువైద్యాధికారి అల్లూరి నాగేంద్ర వర్మ, నున్న పణేంద్రబాబు, హరిత, సర్పంచ్ నున్న రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

వృద్ధురాలి ఇంట్లో చోరీ

ఏలూరు క్రైం, మార్చి 16 : ఓ వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి వెండి, బంగారు వస్తువులు, నగదు అపహరించుకుపోయారు. ఏలూరు ఆమీనాపేటకు చెందిన యలమంచిలి నాగదేవి అనే వృద్ధురాలు ఈనెల 15వ తేదీ రాత్రి తన ఇంట్లో నిద్రించింది. అర్ధరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి రెండున్నర కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.15 వేల నగదు, ఒక సెల్‌ఫోన్ అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు.

భార్యపై భర్త దాడి.. కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 16 : చెడు వ్యసనాలకు బానిసై పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చి భార్యపై దాడి చేసిన భర్తపై ఏలూరు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు ఎన్ఆర్‌పేటకు చెందిన మరపాక పార్వతి భర్త అప్పారావు చెడు వ్యసనాలకు బానిసై ప్రతిరోజు ఆమెను మానసికంగా, శారీరకంగా చిత్ర హింసలకు గురి చేస్తున్నాడు. ఈనెల 15న పూటుగా మద్యం తాగి వచ్చిన అతడు రుబ్బురోలుతో భార్యపై దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అక్రమ కలప పట్టివేత

బుట్టాయగూడెం, మార్చి 16 :మండలంలోని పాతరాజానగరం ప్రాంతంలో అక్రమంగా దాచి ఉంచిన 38 బందారు కలప దిమ్మెలు జంగారెడ్డిగూడెం సబ్ డీఎఫ్‌వో వెంకట సుబ్బయ్య దాడిచేసి పట్టుకున్నారు. గ్రామం సమీపంలోని పామాయిల్ తోటల్లో కలప దిమ్మెలను అక్రమంగా దాచిపెట్టారని వచ్చిన సమాచారం మేరకు సబ్ డీఎఫ్‌వో తమ సిబ్బందితో శనివారం దాడిచేసి పట్టుకుని కన్నాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. గుర్తుతెలియని వ్యక్తులు కలపను అక్రమంగా దాచి ఉంచినట్టు గుర్తించిన అధికారులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



మాదివాడ సెంటర్‌లో కారును ఢీకొన్న బస్సు

ఆకివీడు, మార్చి 16: ఆకివీడు కొత్త బస్టాండ్‌కు వచ్చే రోడ్‌లో కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన శనివారం జరిగింది. ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భీమవరం వెళుతూ ఆకివీడు కొత్త బస్టాండ్‌కు వచ్చేందుకు మాదివాడ సెంటర్‌లోకి తిరుగుతూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులను ఆశ్రయించారు. ప్రయాణికు లను వేరే బస్సులో ఎక్కించి పంపించారు. జాతీయ రహదారి అభివృద్ధి చేయక పోవడంతో ఒక బస్సు వస్తుంటే మరో బస్సు వెళ్లేందుకు వీలులేకపోవడంతో డ్రైవర్లు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైవేపై ఏర్పాటు చేసిన దుకాణాలు తొలగించి ఊరట కల్పించాలని కోరుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు

» ముగ్గురు హిజ్రాలకు గాయాలు

జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 16 :అతివేగంగా ప్రయాణిస్తున్న కారు ఆటోను ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన ఘటన జంగారెడ్డిగూడెం పట్టణంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. పట్టణానికి చెందిన ముగ్గురు హిజ్రాలు డాంగేనగర్ వైపు ఆటోలో ప్రయాణిస్తున్నారు. జంగారెడ్డిగూడెం వైపు వస్తున్న ఓ కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టడంతో వారికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఏరియా ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా ఆటోను ఢీకొట్టిన కారు ఆ పక్కనే ఉన్న ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టడంతో అతడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

గర్భిణులకు కేంద్ర ప్రభుత్వ సాయం అందిస్తాం

» పశ్చిమ గోదావరి జిల్లా డీఎంహెచ్‌వో మహేశ్వరరావు

భీమవరం మార్చి 16 : ప్రధానమంత్రి మాతృ వందన పథకం ద్వారా అర్హులైన గర్భిణులకు నగదు సాయం అందిస్తామని పశ్చిమ గోదావరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి. మహేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి కాన్పుకు రూ.ఐదు వేలు నగదు, రెండో కాన్పులో ఆడపిల్ల పుట్టిన గర్భిణికి రూ. ఆరు వేలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. మొదటి కాన్పు కోసం తొలుత గర్భిణిగా నమోదు చేసుకున్నప్పుడు రూ. మూడు వేలు, జనన నమోదు, మొదటి విడత టీకా నమోదు చేసినప్పుడు రూ.2 వేలు.. మొత్తం రూ.ఐదు వేలను రెండు విడతలలో ఆధార్ అనుసంధానించిన బ్యాంకు ఖాతాలో జమచేస్తారన్నారు. రెండో కాన్పులో ఆడపిల్లకు జన్మించిన గర్భిణికి జనన నమోదు, మొదటి విడత టీకా 14 వారాల లోపు నమోదు చేసుకొన్నప్పుడు రూ. ఆరు వేల ఒకే విడతలో జమ చేస్తారన్నారు. ఈ మేరకు గర్భిణి 12 వారాలలోపు సమీప మహిళా ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తల వద్ద పేర్లు నమోదు చేయించుకుని వైద్య ఆరోగ్య శాఖ వారు అందించే అన్ని ఆరోగ్య సేవలు, ఆర్థిక సాయాన్ని పొందేలా అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు, ప్రజలందరికీ అవగాహన కల్పించాలని ఆదేశించామన్నారు.

'ఉమ్మడి పశ్చిమ'లో 1,935 కేసుల పరిష్కారం

ఏలూరు క్రైం, మార్చి 16 :ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు శనివారం సాయంత్రం వరకు 1,935 కేసులను రాజీ చేశామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీటిలో 1217 క్రిమినల్ కేసులు, 365 సివిల్ కేసులు, 185 కేసులు ప్రీలిటిగేషన్, ఇతర కేసులు రాజీ చేశామని, 128 వాహన ప్రమాద కేసులను రాజీ చేసి రూ.21,03,12,341 పరిహారంగా అందించామన్నారు.

డీఆర్వోగా ఉదయ భాస్కరరావు బాధ్యతలు

భీమవరం, మార్చి 16 : జిల్లా రెవెన్యూ అధికారిగా జె.ఉదయ భాస్కరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టరు చాంబర్‌లో కలెక్టరు సుమిత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పలు శాఖల జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరు కార్యాలయం, జిల్లా జాయింట్ కలెక్టరు కార్యాలయం, జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయ అధికారులు, సిబ్బంది కొత్త జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావును కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఎన్నికలకు ప్రజలందరూ సహకరించాలి : ఎస్పీ

ఇరగవరం, మార్చి16 : ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలందరూ సహకరించాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. శనివారం తణుకు-పాతూరులోని అరుంధతి పేట రామాలయం వద్ద ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేందుకు జిల్లా పోలీసు యంత్రాంగ సహకారం ఎల్లవేళలా ఉంటుందన్నారు.

ప్రశాంతంగా ఒకేషనల్ ఇంటర్ పరీక్షలు

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 16 : ఇంటర్ ఒకేషనల్ కోర్సు మొదటి సంవత్సరం పరీక్షలు పశ్చిమ గోదావరి జిల్లాలో శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఇందులో జనరల్ విద్యార్థులు 102మంది హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,674 మందికి గాను 1,235మంది హాజరయ్యారు. 439 మంది గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వాహకుడు చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

పెద్దింటమ్మ వారికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కైకలూరు, మార్చి 16: కొల్లేటి కోట శ్రీపెద్దింటి అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారు రోజూ విశేష పూజలందుకుంటున్నారు. శనివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి పంచామ వరణ, కలశార్చనపూజ, పుష్పాలంకరణ, త్రినదినామార్చన, కుంకుమ పూజ, ధూపసేవ, బాలభోగం, పంచహారతులను ఆలయ అర్చకులు పేటేటి శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, భక్తుల కు ప్రసాదాన్ని కైకలూరు మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గొట్టుముక్కల శివరామరాజు దంపతులు అందజేయగా వారిని ఆలయ అధికారి కేవీ గోపాలరావు శేష వస్త్రాలతో సత్కరించారు. సాయంత్రం ఆలపాడు విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ చిన్నారుల జానపద నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

నెట్ సెంటర్లో చోరీ

నూజివీడు టౌన్, మార్చి 16: నెట్ సెంటర్ తాళాలు పగుల గొట్టి నగదు అపహరించిన ఘటన నూజివీడు మండలం మీర్జాపురంలో చోటుచేసుకుంది. బాపులపాడు మండలం కొత్త మల్లవల్లికి చెందిన శిలారపు కల్యాణ్ నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలో రాయల్ కమ్యూనికేషన్ పేరుతో ఇంటర్‌నెట్ సెంటర్, మొబైల్ షాపు నడుపుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్ళి శనివారం వచ్చి చూడగా, దుండగులు షాపు తలుపులు బద్దలు కొట్టి దుకాణంలోని రూ.75 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్‌లను అపహరించినట్లు గుర్తించి నూజివీడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

కోడ్ ఎఫెక్ట్

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో తొలగిస్తున్న రాజకీయ ఫ్లెక్సీలు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో శనివారం సాయంత్రం నుంచి రహదారులపై ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించారు. ఎక్కడికక్కడ ఎన్నికల నియామవళి అమలుకు వీలుగా అధికారులు రంగంలోకి దిగారు. సాధ్యమైనంత మేర సాయంత్రం నాటికే ఎక్కడికక్కడ ఫ్లెక్సీలను తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా వున్న పోస్టర్లను తొలగిస్తూ ఆయా పార్టీ కార్యాలయాలకు తరలిస్తున్నారు.







కైకలూరులో తొలగిస్తున్న టీడీపీ ఫ్లెక్సీ, జీలుగుమిల్లి సచివాలయం వద్ద జగన్ ఫొటోను తొలగిస్తున్న సిబ్బంది, కలిదిండిలో వైసీపీ ఫ్లెక్సీని తొలగిస్తున్న దృశ్యం







సరిపల్లెలో ఫ్లెక్సీ తొలగిస్తున్న సిబ్బంది, ఆచంటలో ఫ్లెక్సీ తొలగింపు, ఆగిరిపల్లి మండలంలో ఫ్లెక్సీలు తొలగింపచేస్తున్న అధికారులు

గ్రామాల్లో సాయుధ బలగాల కవాతు



కైకలూరు, మార్చి 11: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు, సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. శనివారం కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్సై టి. రామకృష్ణ ఆధ్వర్యంలో కైకలూరు మండలం భుజబల పట్నం, పల్లెవాడ, ఆలపాడు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజలు పాటించాల్సిన విధి విధానాలను సీఐ కృష్ణకుమార్ ప్రజలకు వివరించారు. ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

లారీ ఢీకొని నెహ్రూ విగ్రహం ధ్వంసం



చాట్రాయి, మార్చి 16: ఆంధ్ర-తెలంగాణ సరిహద్దులో చాట్రాయి మండలం కృష్ణారావుపాలెం- తెలంగాణ రాష్ట్రం వెంకటాపురం గ్రామాల మధ్య ఉన్న దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహాన్ని శుక్రవారం అర్ధరాత్రి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టటంతో ధ్వంసమైంది. రెండు రాష్ట్రాల మధ్య లాండ్ మార్క్‌గా ఉన్న విగ్రహం ధ్వంసం కావటం పట్ల ఇరు రాష్ట్రాల పరిధిలోని సరిహద్దు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన గొర్ల చెన్నారెడ్డి 1965లో ఈ విగ్రహాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఈ విగ్రహం రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దుగా పేరొందింది. అధికారులతో మాట్లాడి మళ్ళీ విగ్రహాన్ని పునః నిర్మించటానికి చర్యలు తీసుకుంటామని వెంకటాపురం గ్రామానికి చెందిన చనుబండ కోదండరామస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వుచ్చుకాయల చెన్నకేశవరెడ్డి చెప్పారు.

నాల్గో రోజుకి చేరిన దీక్షలు

ముదినేపల్లి, మార్చి 16 : పెయ్యేరు పంచాయతీ ఏరియాలోని వైఎస్ఆర్ కాలనీలో మురుగు నీటి పారుదలకు సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ కాలనీ వాసులు చేపట్టిన రిలే దీక్షలు నాల్గో రోజుకు చేరాయి. శనివారం బీజేపీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, పార్టీ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మొవ్వ ఫణీంద్ర, మండల ఉపాధ్యక్షురాలు రెడ్డి నాగలక్ష్మి ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఈ దీక్షల్లో పాల్గొని కాలనీలో పక్కా డ్రైన్లు నిర్మించి మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారులు తమ సమస్యను పట్టించుకోవటం లేదంటూ దీక్షా శిబిరంలో అంబేద్కర్ చిత్రపటానికి కాలనీ వాసులు మెమొరాండం సమర్పించారు.

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



చాట్రాయి, మార్చి 16: నా ఒక్క ఓటు వేయకపోతే ఏమవుతుందిలే అని నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ప్రతి పౌరుడు బాధ్యతగా ఓటు వేయాలని అధికారులు కోరారు. శనివారం ఎంపీడీవో మంగాకుమారి, ఉపాధి ఏపీవో లక్ష్మీకుమారి ఆధ్వర్యంలో చాట్రాయిలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ డబ్బు, ఇతర ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు వేసి మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. ఉపాధి కూలీలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులకు రాజ్యాంగంపై అవగాహన

మండవల్లి, మార్చి 16: రాజ్యాంగంపై బాల్యం నుంచే అవగాహన ఉండాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. మండవల్లి మండలం మూడుతాళ్లపాడు ఎంపీపీ పాఠశాలలోని బాలబాలికలకు టీచర్ కుమారి అధ్యక్షతన బొమ్మలతో కూడిన 'బాలల కోసం భారత రాజ్యాంగ ప్రవేశిక' పుస్తకంలోని చిత్రాలను చూపించి, చదివించి పలు విషయాలపై శనివారం అవగాహన కల్పించారు.

పెద్దింటమ్మ వారికి విశేష పూజలు



కైకలూరు, మార్చి 16: కొల్లేటి కోట శ్రీపెద్దింటి అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారు రోజూ విశేష పూజలందుకుంటున్నారు. శనివారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి పంచామృత స్నపన, కలశార్చనపూజ, పుష్పాలంకరణ, త్రిసదినామార్చన, కుంకుమ పూజ, ధూపసేవ, బాలభోగం, పంచహారతులను ఆలయ అర్చకులు పేటేటి శర్మ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ, భక్తుల కు ప్రసాదాన్ని కైకలూరు మండలం దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గొట్టుముక్కల శివరామరాజు దంపతులు అందజేయగా వారిని ఆలయ అధికారి కేవీ గోపాలరావు శేష వస్త్రాలతో సత్కరించారు. సాయంత్రం ఆలపాడు విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్ చిన్నారుల జానపద నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.

పాల సొసైటీ భవనానికి శంకుస్థాపన

ముసునూరు, మార్చి 16: మండలంలోని పెదపాటివారిగూడెంలో మహిళా పాల సొసైటీ నూతన భవనానికి కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు శనివారం శంకుస్థాపన చేశారు. పాడిరైతుల సంక్షేమానికి అనేక సబ్సిడీ పథకాలను అమలు చేస్తున్నామని చలసాని తెలిపారు. నూతన భవనాలను నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సంఘ అధ్యక్షురాలు వి.సుగుణ, క్లస్టర్ మేనేజర్ కిలారి కిరణ్, రూట్ సూపర్‌వైజర్ పి.వీరాంజనేయులు, పాలకవర్గ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటా : ముద్దరబోయిన



ముసునూరు, మార్చి 16: నూజివీడు నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం గోపవరంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ముద్దరబోయిన పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం జరిగిన సభలో ముద్దరబోయిన మాట్లాడుతూ తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తానని అన్నివర్గాల ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

చెత్త బుట్టల పంపిణీ

కైకలూరు, మార్చి 16: ప్రజలు తమ ఇళ్లలోని తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేయాలని సర్పంచ్ డీఎం నవరత్నకుమారి అన్నారు. శనివారం కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద చెత్త బుట్టలను పంపిణీ చేసి మాట్లడుతూ ఇళ్లల్లోని చెత్తను రోడ్లు, డ్రైన్లలో వేయకుండా చెత్తబుట్టల్లోనే వేయాలన్నారు. ప్రతి రోజూ ఇంటింటికి వచ్చే చెత్త రిక్షాలకు తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు, వార్డు సభ్యుడు గాలిబ్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నెట్ సెంటర్లో చోరీ

నూజివీడు టౌన్, మార్చి 16: నెట్ సెంటర్ తాళాలు పగుల గొట్టి నగదు అపహరించిన ఘటన నూజివీడు మండలం మీర్జాపురంలో చోటుచేసుకుంది. బాపులపాడు మండలం కొత్త మల్లవల్లికి చెందిన శిలారపు కళ్యాణ్ నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలో రాయల్ కమ్యూనికేషన్ పేరుతో ఇంటర్నెట్ సెంటర్, మొబైల్ షాపు నడుపుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్ళి శనివారం వచ్చి చూడగా, దుండగులు షాపు తలుపులు బద్దలు కొట్టి దుకాణంలోని రూ.75 వేల నగదు, రెండు మొబైల్ ఫోన్‌లను అపహరించినట్లు గుర్తించి నూజివీడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

మేరీమాత కానుకల హుండీలో నగదు చోరీ

ఆగిరిపల్లి, మార్చి 16: చిన్నాగిరిపల్లి శివారు నర్సాలగూడెంలోని ఆర్సీఎం చర్చి సమీపంలో మేరీమాత విగ్రహం వద్ద కానుకల హుండీని శుక్రవారం అర్ధరాత్రి దుండగులు పగులకొట్టి నగదు దోచుకున్నారు. చోరీ అయిన సొమ్ము సుమారు రూ.50వేలు వరకు ఉంటుందని, ఈ హుండీ మరి కొద్దిరోజుల్లో తెరుస్తామనగా ఇలా జరిగిందని కమిటీ నిర్వాహకులు వాపోయారు.



కైకలూరులో స్వచ్ఛందంగా తొలగింపు



ఆగిరిపల్లిలో అధికారుల ఆధ్వర్యంలో..



కలిదిండిలో శిలాఫలకంపై ప్రజాప్రతినిధుల ఫోటోలపై స్టిక్కర్లు అంటించిన దృశ్యం

కోడ్ కూసింది.. ఫ్లెక్సీలు తొలగాయి

కైకలూరు, మార్చి 16: ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రహదారులపై ఏర్పాటుచేసిన టీడీపీ ఫ్లెక్సీలను మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా తొలగించారు. ఎన్నికల నిబంధనలలో భాగంగా ముందస్తుగానే స్వచ్ఛందంగా తాము తొలగిస్తున్నట్లు ఆయన తెలిపారు. కైకలూరు పట్టణం మొత్తం మీద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను ట్రాక్టర్ల ద్వారా పార్టీ కార్యాలయానికి తరలించారు.

ఆగిరిపల్లి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆఫీస్‌లలో ప్రజాప్రతినిధుల ఫొటోలు, గ్రామాల్లో పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు. కోడ్ అమల్లోకి రావడంతో దగ్గరుండి ఊరిలోని ఫ్లెక్సీలు తొలగింప జేశారు. పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో ఎంసిసి ఇన్‌చార్జ్ దినతేజ్ ఆధ్వర్యంలో శనివారం కలిదిండిలో పబ్లిక్ స్థలాల్లో ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకుల ఫ్లెక్సీలను తొలగించారు. శిలాఫలకాలపై ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధుల ఫొటోలపై వైట్ పేపర్ అంటించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు.



సమస్యలపై మాట్లాడుతున్న దుర్గాప్రసాద్ (ఇన్‌సెట్) మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణిదుర్గ

సురక్ష సొమ్మేదీ?

» అధికారులను నిలదీసిన వైసీపీ కౌన్సిలర్లు

» నిధులు కేటాయించినా సొమ్ము ఇవ్వకపోవడంపై అసహనం

నూజివీడు టౌన్, మార్చి 16: జగనన్న ఆరోగ్య సురక్షకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించినా ఆ ఆర్థిక భారాన్ని కౌన్సిలర్లే భరించాలనేలా అధికారులు వ్యవహరించటంపై నూజివీడు మున్సిపల్ సమావేశంలో అధికార పార్టీ కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. నూజివీడు మున్సిపల్ సమావేశం చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు మున్సిపల్ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష సభల భారం కౌన్సిలర్లపై పడిందని, సదరు కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినా సంబంధిత మొత్తాన్ని కౌన్సిలర్లకు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారంటూ అధికార పార్టీ కౌన్సిలర్లు మున్సిపల్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలో కోతులు, కుక్కల బెడద నివారణకు గత మూడు నెలలుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెబుతున్న అధికారులు ఇటీవల ఎలుగుబంటి వేషధారణతో చర్యలు చేపట్టారని అవి ఎంత మేరకు ఫలితాన్ని ఇస్తాయో తెలియదని మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, అధికారుల తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగంలో హెల్త్ వర్కర్లకు ఇవ్వాల్సిన అత్యవసర వస్తువులు అందజేతపైనా, 11 మంది మజ్దూర్‌లతో 67 రోజుల పాటు సేవలందించేందుకు ఖర్చుచేయాల్సిన బడ్జెట్‌పైన అజెండాను ప్రవేశపెట్టి ఆమోదం పొందారు.





నూజివీడు, కైకలూరులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

నూజివీడు, మార్చి 16: జాతీయ లోక్ అదాలత్ ద్వారా శనివారం 160 కేసులను పరిష్కరించి బాధితులకు నష్టపరిహారంగా రూ. 28.92 కోట్లను అందించినట్లు 15వ అదనపు జిల్లా న్యాయాధికారి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ. నాగశైలజ తెలిపారు. శనివారం నూజివీడు కోర్టుహాల్ ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించగా, పరిష్కరించదగ్గ క్రిమినల్ కేసులు 85, సివిల్ కేసులు 55, చెక్ బౌన్స్ కేసులు ఆరు, ప్రి లిటిగేషన్ కేసులు పది, మోటారు వెహికల్ కేసులు రెండు, ఇతర కేసులు రెండింటిని పరిష్కరించి 28.92 లక్షలను బాధితులకు నష్టపరిహారంగా అందించటం జరిగిందన్నారు. నూజివీడు సీనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ పెద బాసిం, 1వ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి వి.వెంకటేశ్వరరావు, ప్రత్యేక న్యాయాధికారి విశ్వనమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, సీనియర్ న్యాయ వాదులు మడుపల్లి బసవారావు, విక్రమ్‌కుమార్, కేజే డిక్సన్ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: లోక్ అదాలత్‌లో కేసులను కక్షిదారులు రాజీ చేసుకుంటే వారి అమూల్యమైన సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందని కైకలూరు సీనియర్ న్యాయసేవాధికారి వీవీఎస్‌వి లక్ష్మి, జూనియర్ న్యాయసేవాధికారి ఎం శివకిరణ్ అన్నారు. శనివారం కైకలూరు న్యాయస్థానాల సముదాయంలో జాతీయ మెగాలోక్ అదాలత్‌లో 138 కేసులను రాజీ చేశారు. ఐపీసీ క్రిమినల్ కేసులు 71, ఎక్సైజ్ 23, సివిల్ 14, ప్రి లిటిగేషన్ కేసులు 18, ఎన్ఐ చెక్‌బౌన్స్ కేసులు 7, మనోవర్తి కేసు ఒకటి రాజీ చేసినట్లు తెలిపారు. ఈ కేసుల ద్వారా రూ.36,40,069 కక్షి దారులకు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.







పొట్టిశ్రీరాములు విగ్రహాలకు నూజివీడులో జనసేన, కైకలూరులో టీడీపీ, కలిదిండిలో ఆర్యవైశ్య సంఘ నాయకుల నివాళి

అమరజీవి త్యాగం స్ఫూర్తి కావాలి

నూజివీడు టౌన్, మార్చి 16: అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను నూజివీడులో ఘనంగా నిర్వహించారు. నూజివీడు జనసేన నాయకులు స్థానిక పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా తెలుగువారి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగిందని, ఆంధ్రరాష్ట్ర సాధనలో పొట్టిశ్రీరాములు చేసిన సేవలు నిరుపమానమైనవన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నూరిశెట్టి శివ, ఏనుగుల చక్రి, జక్కుల లక్ష్మి, రామిశెట్టి తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు 103వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం కైకలూరులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ డీఎం నవరత్నకుమారి పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళుల ర్పించారు. ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం చేసిన మహోన్నతమైనదని ఆయన త్యాగం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీజేఎస్ మాల్యాద్రి, మాజీ సర్పంచ్ తెంటు నాగేశ్వరరావు, మైనార్టీ నాయకులు ఎండీ ఉస్మాన్, సయ్యద్ బాషీద్, టీడీపీ నాయకులు వేములపల్లి కారుణ్య, గంగుల ఏసురాజు, లక్ష్మిశెట్టి మోహన్, వీరబత్తిన సుధా, బీజేపీ నాయకుడు పేరిచర్ల ప్రసాదరాజు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అచంట వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూర శ్రీధర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం అమరణ దీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి చిరస్మరణీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలు యువతకు స్ఫూర్తి కావాలన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పలివెల ప్రకాశరావు, నీలి సుమన్, నూకల శ్యామలరావు గుప్తా, మండా సూర్యనారాయణ, నీలి రవి కుమార్, కూర్మాల శ్యామ్, వచ్చిగోళ్ల ప్రసాద్, నీలి మాధవి తదితరులు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన.. బహుమతుల పంపిణీ



కైకలూరు, మార్చి 16: లేగదూడల పెంపకానికి రైతులు మక్కువ చూపి పాడి పరిశ్రమను అభివృద్ధి పథంలో నడపాలని గన్నవరం పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం వేమవరప్పాడులో పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా లేగదూడల ప్రదర్శన నిర్వహించింది. 28 లేగదూడలు పాల్గొనగా మొదటి బహుమతి ఒంగోలు జాతి దూడ పెంపకందారు బీఎస్ వెంకటేశ్వరరావు అనే రైతుకు దక్కగా రెండో బహుమతి ముర్రా జాతి దూడ పెంపకందారు గొల్లేరు సత్యనారాయణ దక్కించుకున్నారు. మూడో బహుమతి ముర్రా జాతి దూడ పెంపకందారు సున్న రాంబాబుకు అందజేశారు. ప్రతి రైతుకు ప్రోత్సాహకాలు, లేగదూడల ఎదుగుదలకు కావాల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కైకలూరు పశుసంవర్ధక శాఖ ఏడీ పఠాన్ ముస్తాఫాఖాన్, పశువైద్యాధికారి అల్లూరి నాగేంద్ర వర్మ, సున్న పణీంద్రబాబు, హరిత, సర్పంచ్ సున్న రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి విజయానికి సమష్టి కృషి



ముదినేపల్లి, మార్చి 16 : కూటమి విజయానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే సమష్టిగా కృషి చేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం సాయంత్రం ముదినేపల్లిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజిమెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయానికి ఆయా పార్టీల నాయకులు ఏకాభిప్రాయంతో వ్యవహరించాలని కోరారు. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు, ముదినేపల్లి ఉప సర్పంచ్ ఈడే సుధాకర్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వంతగాని సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో పార్టీ కార్యకర్తలు బాణాసంచా పేల్చారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కైకలూరు/మండవల్లి, మార్చి 16: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈఓ డి. రామారావు తెలిపారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని కైకలూరు మండలంలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీ చైతన్య, భాష్యం స్కూల్, మండలంలోని భుజబలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 240 మంది, భాష్యం స్కూల్లో 215 మంది, శ్రీ చైతన్యలో 240 మంది, భుజబలపట్నం హైస్కూల్లో 283 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. మండలంలోని కొల్లేటికోట, ఆలపాడు జడ్పీ హైస్కూళ్లలోని విద్యార్థులు భుజబలపట్నం పరీక్షా కేంద్రంలో, దొడ్డిపట్ల హైస్కూల్ విద్యార్థులు కలిదిండి మండలం ఆరుతెగలపాడు హైస్కూల్లో, తామరకొల్లు విద్యార్థులు కలిదిండి మండలం కోరుకొల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో పరీక్షలు రాస్తారని తెలిపారు.

మండవల్లి మండలంలో...

మండలంలో 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ డి రామారావు తెలిపారు. మండవల్లి జడ్పీ హైస్కూల్లో 320 మంది విద్యార్థులు, మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 100 మంది, మండలంలోని చింతపాడు జడ్పీ హైస్కూల్లో 201 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్, మంచినీటి వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు.

చాట్రాయి: రేపటి నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 279 మంది, ఆర్సీయం స్కూల్‌లో పరీక్షా కేంద్రాంలో 189 మంది టెన్త్ పరీక్షలు రాయనున్నారని చెప్పారు. జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రానికి ప్రసాదరెడ్డి, ఆర్సీయం పరీక్షా కేంద్రానికి శోభారాణి చీఫ్ సూపరెండెంట్‌లుగా వ్యవహరిస్తారని ఎంఈవో వివరించారు.



టెన్త్ పరీక్షా కేంద్రంగా కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ముసునూరు: మండలంలో టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో సుబ్బారావు తెలిపారు. శనివారం ముసునూరు జడ్పీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడుతూ 3 పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ముసునూరు జడ్పీ పాఠశాలలో రెగ్యులర్ విద్యార్థులు 201 మంది, సప్లిమెంటరీ విద్యార్థులు 32 మంది, చెక్కపల్లిలో రెగ్యులర్ 236, సప్లిమెంటరీ 56, గోపవరంలో రెగ్యులర్ 147 మంది సప్లిమెంటరీ విద్యార్థులు 54 మంది పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

» ఫిర్యాదు చేద్దామన్నా అధికారులేరీ? » గ్రామస్థుల ఆగ్రహం



నాగన్న చెరువులో మట్టి తోలకాలు

నూజివీడు టౌన్, మార్చి 16: నూజివీడు మండలం హనుమంతులగూడెంలో నిబంధనలకు విరుద్ధంగా మట్టి తోలకాలు సాగుతున్నా ఆ దిశగా అధికారులు దృష్టి సారించటం లేదనే ఆరోపణలు న్నాయి. హనుమంతుల గూడెం నాగన్నచెరువులో మూడు ఎక్స్‌కవేటర్లు, 100 ట్రాక్టర్‌లతో నిబంధనలు అతిక్రమించి మట్టి తోలకాలు చేపట్టారని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసేందుకు యత్నించినా వారు అందుబాటులోకి రాలేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినా అక్రమ మట్టి తోలకాలు అధికార పార్టీ కనుసన్నల్లో జోరుగా సాగుతోందని, సచివాలయ సిబ్బంది మట్టి తోలకాలను చూసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై నూజివీడు తహసీల్దార్ ఏవీ శాస్త్రిని వివరణ కోరగా హనుమంతులగూడెం నాగన్నచెరువు పంచాయతీ పరిధిలో ఉందని, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నూజివీడు ఎంపీడీవోను వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు టౌన్, మార్చి 16: నూజివీడు పట్టణంలో సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ ఏ.సత్యనారాయణ తెలిపారు. నూజివీడు పట్టణంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయటం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంటీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా స్వర్ణలత



నూజివీడు టౌన్, మార్చి 16: నూజివీడు మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.స్వర్ణలత శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదే కళాశాలలో ఆమె ఎకనమిక్స్ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తుండగా ప్రమోషన్‌పై ఆమెను ప్రభుత్వం ఈ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు ప్రిన్సిపల్‌గా ఎఫ్ఏసీ పై దుర్గాప్రసాద్ ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించగా ఆయన స్థానంలో నూతన ప్రిన్సిపాల్‌గా స్వర్ణలత శనివారం బాధ్యతలు స్వీకరించారు.

కైకలూరు ప్రిన్సిపాల్‌గా శాంతి జ్యోతి



కైకలూరు, మార్చి 16: కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎన్. శాంతిజ్యోతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తూ పదోన్నతిపై కైకలూరు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. అధ్యాపక సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల హాజరు పెంచి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని శాంతిజ్యోతి తెలిపారు.

సప్తగిరి బ్యాంక్ ఉద్యోగుల నిరసన

ఆగిరిపల్లి, మార్చి 16: ఉమ్మడి కృష్ణా, చిత్తూరు జిల్లాల్లోని సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు నిరసనబాట పట్టారు. బ్యాంకులో త్వరలో ప్రవేశ పెట్టనున్న అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి పిలిచిన టెండర్లు, నోటిఫికేషన్‌ను ఉపసంహరించాలని, ఇది వరకే ఇచ్చిన హైకోర్టు ఆదేశాలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రావిడెంట్ ఫండ్‌ను పీఎఫ్ శాఖ కు జమచేయాలని, బోనస్ వెంటనే చెల్లించాలని యూనియన్ అధ్యక్షుడు శివరాంబాబు కోరారు. డిమాండ్లు పరిష్కరించకుంటే 26 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు.

పెండ్లి కుమారుడికి బంగారు నాణెం అందజేత

చాట్రాయి, మార్చి 16: యర్రావారిగూడెం పాల సహకార సంఘ సభ్యుడైన మేడసాని రామారావు కుమారుడి వివాహం సందర్భంగా కృష్ణామిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద రూ. 20 వేలు విలువైన బంగారు నాణేన్ని బహూకరించారు. శనివారం సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, మేనేజర్ పొంబశివమూర్తి అందజేశారు. సంఘం అధ్యక్షురాలు బాల శేషకుమారి, పాడి రైతులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ. 50 వేలు విరాళం



చాట్రాయి, మార్చి 16: మండలంలోని కోటపాడు గౌడ బజారు సెంటర్‌లో నూతనంగా నిర్మించిన రామాలయం ప్రతిష్ఠ ఈనెల 30న జరనున్నందున, గ్రామ టీడీపీ అధ్యక్షుడు మందిన పూర్ణచంద్రరావు ఆలయ కమిటీ సభ్యులకు శనివారం రూ. 50 వేలు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రీను, పుల్లయ్య, రమేష్, రాజేష్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



ముసునూరు, మార్చి 16: రమణక్కపేట జడ్పీ పాఠశాలలో బాస్కెట్ బాల్ క్రీడాకారులకు వ్యాపారవేత్త చిల్లారి శ్రీనివాసరావు శనివారం క్రీడా దుస్తులను బహూకరించారు. సుమారు రూ. 15 వేలు విలువైన దుస్తులను 25 మంది బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు దాత అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉన్నతస్థాయికి వెళ్లాలని దాత శ్రీనివాసరావు ఆకాంక్షించారు. హెచ్ఎం రామకృష్ణారావు, పీడీ వాకా నాగరాజు పాల్గొన్నారు.

రైతు బజార్ నిర్మాణానికి చర్యలు

కలిదిండి, మార్చి 16 : కలిదిండిలో అసంపూర్తిగా ఉన్న రైతు బజార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని మార్కెట్ యార్డు కార్యదర్శి వరలక్ష్మి తెలిపారు. రైతు బజార్ నిర్మాణ పనులు పూర్తి చేయటానికి నిధులు మంజూరయ్యాయని టెండర్ కార్యక్రమం కూడా పూర్తయిందన్నారు. మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శుల నియామకం

ముదినేపల్లి, మార్చి 16 : ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల పోస్టులను గ్రామ సచివాలయాల గ్రేడ్-5 కార్యదర్శులతో భర్తీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు పూర్వపు కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న పంచాయతీ కార్యదర్శుల పోస్టులను భర్తీ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు శనివారం ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాల ప్రకారం ప్రస్తుతం ఏలూరు జిల్లాలో కలసిన కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల్లోని 29 గ్రామ పంచాయతీలకు కార్యదర్శులుగా అదే పంచాయతీల పరిధిలోని సచివాలయాల గ్రేడ్-5 కార్యదర్శులను రెగ్యులర్ కార్యదర్శులుగా నియమించారు. మరో 11 గ్రామ సచివాలయాలకు అదే సచివాలయాల గ్రేడ్-5 కార్యదర్శులను కూడా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కైకలూరు నియోజకవర్గంలోని ముదినేపల్లి మండలం అల్లూరు పంచాయతీకి టి.కిరణ్ కుమార్, సింగరాయ పాలెంకు చింతా సత్యవాణి, పేరూరుకు ఎం.సాయి ప్రదీప్, దేవపూడికి పి.మనోజ్ కుమార్, పెనుమల్లికి టీవీ శ్రీనివాసరావు, మండవల్లి మండలం లింగాలకు బి.శ్రీనివాస్, పులపర్రుకు ఎస్‌వీఎస్ కుమార్, ఇంగిలిపాకలంకకు బి.జకరయ్య, పెనుమాక లంకకు డి.నాగరాజు, కైకలూరు మండలం చటాకాయ పంచాయతీకి కె.రవికిరణ్ బాబు, పల్లెవాడకు కె.శశిధర్, కలిదిండి మండలం పడమటి పాలెంకు ఎస్.శివనాగరాజు, చింతలమడకకు పి.రాంబాబు, వెంకటాపు రానికి జె.సూర్య ప్రకాష్‌లను కార్యదర్శులుగా కలెక్టర్ నియమించారు.

వీరు కాక ముదినేపల్లి-2 సచివాలయ కార్యదర్శి డి.సునీత, ఆటపాక -2 సచివాలయ కార్యదర్శి జె.లక్ష్మి ప్రసన్న, కైకలూరు-3 సచివాలయ కార్యదర్శి కె.రవి శంకర్, కైకలూరు -4 సచివాలయ కార్యదర్శి ఎం.కళావతి, కైకలూరు-5 సచివా లయ కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు, కలిదిండి-2 సచివాలయ కార్యదర్శి ఎస్.రాజ రాజేశ్వరిలను ఆయా సచివాలయాలకు రెగ్యులర్ కార్యదర్శులుగా నియమించా రు. అయితే వీరు ఆయా సచివాలయాల గ్రూపు పంచాయతీల గ్రేడ్-1 కార్యదర్శి పర్యవేక్షణలో విధులు నిర్వహిస్తారు. పంచాయతీ కార్యదర్శులుగా నియమితు లైన గ్రేడ్-5 కార్యదర్శులకు పరిపాలనకు సంబంధించిన అధికారాలతోపాటు డ్రాయింగ్ పవర్స్ కూడా ఉంటాయని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.